వైఎస్ఆర్ కడప-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
సోమవారం 29 జూన్ 2026

# అమ్మవారి సేవలో న్యాయమూర్తులు


న్యాయమూర్తులను సత్కరిస్తున్న ఏకాంబరం

**బోయకొండ(చౌడేపల్లి), జూన్ 28 ప్రభాతవార్త**

శక్తి స్వరూపిణీ బోయకొండ గంగమ్మను నలుగురు న్యాయమూర్తులు దర్శించుకొన్నారు. ఆదివారం రాష్ట్ర సర్వోత్తమ న్యాయస్థానం న్యాయమూర్తులు మహేశ్వరరావు, టిసిడి శేఖర్, చిత్తూరు జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి ఎన్.జయసూర్య, జిల్లా న్యాయమూర్తి అరుణ చారుకలు అమ్మవారి దర్శనార్థం వచ్చారు. వారికి ఇఓ, ఉపకమీషనర్ ఏకాంబరం ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. అమ్మవారి దర్శనభాగ్యం తర్వాత మండపంలో వేదపండితుడు గోవర్ధనశర్మ వేదాశీర్వాదం చేసారు. అనంతరం న్యాయమూర్తులకు అమ్మవారి శేష వస్త్రాలు, పవిత్ర తీర్థ ప్రసాదాలందించారు. పుంగనూరు రూరల్ సిఐ సాయిప్రసాద్, తహాశీల్దార్ భూపతి పార్వతి, ఎస్ఐ చిన్నరెడ్డెప్ప, రెవిన్యూ, పోలీసు సిబ్బంది, ఆలయ అధికార, అర్చక, సిబ్బంది పాల్గొన్నారు.

# చక్కటి జీవితానికి పోలియో చుక్కలు

## టిడిపి నేత నల్లారి రియాజ్



**పీలేరు జూన్ 28 ప్రభాతవార్త:**

చక్కటి జీవితానికి రెండు పోలియో చుక్కలు తప్పనిసరి అని పీలేరు టిడిపి నేత నల్లారి రియాజ్ అన్నారు. స్థానికంగా పోలియో చుక్కలు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి బిడ్డకు పోలియో మహమ్మారి నుండి రక్షణ కల్పించడానికి పోలియో చుక్కలు వేయించాలని అన్నారు. గతంలో పోలియో బారిన పడి అంగవైకల్యంతో ప్రస్తుతం శారీరకంగా మానసికంగా ఇబ్బందులు పడుతున్న వారిని చూస్తే చాలా బాధాకరంగా ఉంటుందని అన్నారు. అలాంటి పరిస్థితి భవిష్యత్తులో మరెవరికి రాకుండా ఉండడానికి పోలియో చుక్కలు కార్యక్రమం తప్పనిసరి అని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో పాల్గొన్న వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందికి ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.

# ఆకేపాటి ప్రభుత్వ భూముల

# ఆక్రమణలపై కలెక్టర్ కొరడా

**2కిలోమీటర్ల దూరం వేసిన కంచెను పీకేశారు**

**350 ఎకరాల ప్రభుత్వ ఆక్రమిత భూముల స్వాధీనానికి కలెక్టర్ సిద్ధం**

**50 ఎకరాలు స్వాధీనం చేసుకున్నామన్న తాసిల్దార్**

**పోలీసుల కనుసన్నలలో ప్రభుత్వ భూములని బోర్డులు ఏర్పాటు**



ప్రభుత్వ భూమిలో ఫెన్సింగ్ తొలగించి బోర్డునాటుతున్న రెవెన్యూ అధికారులు


పోలీసుల కనుసన్నలలో శ్రీరంగరాజపురంలో భూఆక్రమణల తొలగింపు

**రాజంపేట, జూన్28 ప్రభాతవార్త**

రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి కుటుంబ సభ్యులు ప్రభుత్వ భూములు ఆక్రమించిన దందాపై జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి కొరడా ఝులిపించారు. ప్రభుత్వ భూములులోకి ప్రవేశిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయించారు. ఆకేపాడులో వందల ఎకరాల ప్రభుత్వ భూముల ఆక్రమణల భూభాగతం పై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆదివారం రాజంపేట రెవెన్యూ యంత్రాంగం భారీ పోలీసు బందోబస్తు మధ్య రాజంపేట మండలంలోని శ్రీరంగరాజపురం, ఆకేపాడు రెవెన్యూ గ్రామాల పరిధిలో సుమారు రెండు కిలోమీటర్ల దూరం పొడవున వేసిన కంచె ఆక్రమణలు తొలగించారు. **వార్త దినపత్రికలో** నెల 24న ఒక సామాన్యుడు ఎకరా భూమి ఆక్రమిస్తే ఇది ప్రభుత్వ భూమి అని బోర్డు పెడుతుంది రెవెన్యూ శాఖ. ఈ స్థలంలోకి ప్రవేశిస్తే సివిల్, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని బోర్డులో తహసిల్దార్ హెచ్చరిస్తారు. ప్రభుత్వం భూమిని ఆక్రమించి కంచి ఏర్పాటు చేసి ఉన్నట్లయితే కంచెను పీకి ఫోటోలు పత్రికల వారికి పంపుతారు. ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తారు. మరి ఒక శాసనసభ్యుడు ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 114 ఎకరాల ప్రభుత్వం భూములు ఆక్రమించినా పట్టించుకోలేదంటూ కంచె కూడా పీకలేరు, నేతలు అంటే రెవెన్యూకి వణుకా శీర్షికన వార్త కథనం వెలువడడంతో సీరియస్‌గా కలెక్టర్ స్పందించారు. చట్టం ఎవరికైనా ఒకటే అని స్పష్టం చేశారు. ప్రభుత్వ భూముల స్వాధీనానికి సంబంధించి కఠిన చర్యలు తీసుకోవాలని రాజంపేట తాసిల్దార్ దస్తగిరయ్యను ఆదేశించారు. ఈ మేరకు ఆదివారం రాజంపేట తాసిల్దార్ దస్తగిరయ్య, మండల సర్వేయర్ వెంకటసుబ్బయ్య ,స్థానిక వీఆర్వో మల్లికార్జున పోలీసులతో కలిసి వెళ్లి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ప్రభుత్వ భూములను ఆక్రమించి వేసిన కంచెను యంత్రం సహాయంతో తొలగించారు. శ్రీరంగరాజపురం, ఆకేపాడు పొలాల్లో ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకున్న తరువాత వాటిలో ప్రభుత్వ బోర్డుల హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ భూముల్లో ఎవరు ప్రవేశించినా కఠిన చర్యలు తీసుకుంటామని తాసిల్దార్ హెచ్చరిక బోర్డు లో పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా కలెక్టర్కు ప్రజా పరిష్కార వేదికలు రాజంపేట మండలంలోని శేషమాంబపురం, ఆకేపాడు, మందపల్లె, శ్రీరంగరాజుపాలెం రెవిన్యూ గ్రామాల పరిధిలో వందల ఎకరాల ప్రభుత్వ భూములు ఆక్రమణకు సంబంధించి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ భూములు స్వాధీనం చేసుకున్నామని తాసిల్దార్ దస్తగిరయ్యా మీడియాకు తెలిపారు. అమలా రెడ్డి కుటుంబ సభ్యులు ఆక్రమించిన ప్రభుత్వంలో స్వాధీనం చేసుకున్న తర్వాత జిల్లా కలెక్టర్కు తాసిల్దార్ నివేదిక పంపినట్లు సమాచారం. తాసిల్దార్ నివేదిక ప్రకారం శ్రీరంగరాజపురం రెవెన్యూ పొలంలో సర్వేనెంబర్ 150/1,150/3,151/1,151/2, 37, 142, 143, 149/3, ఆకేపాడు రెవెన్యూ పొలంలో 1302/3,1302/5, 1301/1, 1299/1,1300/1 సర్వేనెంబర్లలో సుమారు 50 ఎకరాలు ఆక్రమణ తొలగించి స్వాధీనం చేసుకున్నట్లు తాసిల్దార్ పేర్కొన్నారు. కాగా అధికారిక సమాచారం మేరకు ఇక్కడి నుంచి బదిలీపై వెళ్లిన తాసిల్దార్ పీర్ మున్నీ .మిగతా 2వ పేజీలో

# పోలియో రహిత పట్టణంగా తీర్చిదిద్దాలి

## ఎమ్మెల్యే షాజహాన్‌బాషా



**మదనపల్లె, జూన్ 28 ప్రభాతవార్త :**

పోలియో రహిత పట్టణంగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. జిల్లా వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఆదివారం రూరల్ మండలంలోని కోళ్ళబైలు గ్రామ పంచాయితీ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన పల్స్‌పోలియో కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈసందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పల్స్‌పోలియోపై యుద్ధం ప్రకటించి అప్పుడే పుట్టిన బిడ్డనుంచి 5సంవత్సరాలు నిండిన పిల్లలకు తప్పనిసరిగా పోలియోచుక్కలు వేయించాలన్నారు. మూడు రోజులు పాటు పోలియో చుక్కల కార్యక్రమం ఇంటింటా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించి పోలియో మహమ్మరినుంచి రక్షణ పొందాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యశాఖ అధికారి లక్ష్మీనరసయ్య, ఎండిఓ తాజ్‌మస్రూన్, స్థానిక ఆరోగ్యశాఖ అధికారులు. టిడిపి నాయకులు శ్రీనివాసులునాయుడు, మోహన్‌రెడ్డి, శేఖర్, శ్రీనాధ్, జేసిబి వేణు, ప్రభాకర్,సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. అనంతరం మదనపల్లె నియోజకవర్గంలో ఐదు మందికి ఎమ్మెల్యే చేతుల మీదుగా రూ.4.50లక్షలు సిఎం సహాయనిధి కింద లబ్దిదారులకు వారి వారి ఇంటివద్దకు వెళ్ళి అందజేశారు. దీంతో లబ్దిదారులు ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు కృతజ్ఞతలు తెలిపారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి



**ప్రొద్దుటూరు అర్బన్, జూన్ 28, ప్రభాతవార్త**

వివిధ అనారోగ్యలతో ఆసుపత్రుల పాలై ఆర్థికంగా చితికిపోయిన కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఊరటనిస్తోందని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి అన్నారు. స్థానిక నెహ్రూరోడ్డు లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన 29వ విడత 61 మంది లబ్ధిదారులకు రూ.55.36 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పేదలు, మధ్యతరగతి కుటుంబాలు వైద్య ఖర్చుల కోసం అప్పుల పాలుకాకుండా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో ముఖ్యమంత్రి సహాయనిధిని అందిస్తోందన్నారు. అత్యవసర వైద్య చికిత్సల కోసం కార్పొరేట్ ఆసుపత్రులను ఆశ్రయించిన కుటుంబాలకు ఈ పథకం ఎంతో ఉపయోగపడుతోందని పేర్కొన్నారు. ప్రొద్దుటూరు నియోజకవర్గానికి ముఖ్యమంత్రి సహాయనిధి మంజూరులో రాష్ట్రవ్యాప్తంగా విశేష గుర్తింపు లభిస్తోందని ఆయన తెలిపారు. ఇప్పటి వరకు మొత్తం 1,302 మంది లబ్ధిదారులకు రూ.11.34 కోట్లకు పైగా ఆర్థిక సహాయం అందిందని, చెక్కుల పంపిణీలో ప్రొద్దుటూరు నియోజకవర్గం రాష్ట్రంలో అగ్రస్థానాల్లో కొనసాగుతోందని వెల్లడించారు. ఆరోగ్యవంతమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, పేదల సంక్షేమం, ప్రజల ఆరోగ్య రక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అవసరమైన ప్రతి అర్హ కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయనిధి అందేలా కృషి కొనసాగుతుందని తెలిపారు. బిజెపి జిల్లా కార్యదర్శి కంబగిరి కూడా ఈ లబ్ధిదారుల జాబితాలో ఉన్నారు. ఈ సందర్భంగా కంబగిరి ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల నాగరాజు, కడప పార్లమెంట్ తెలుగుదేశంలో పార్టీ అధికార ప్రతినిధి ఘంటసాల వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షుడు చల్లా రాజగోపాల్ యాదవ్, మాజీ పట్టణ అధ్యక్షుడు ఈవి సుధాకర్ రెడ్డి, టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు చింతకుంట కుతుబుద్దీన్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కొండయ్య, మాజీ కౌన్సిలర్లు ఎర్రన్న, జిలాన్, కమాల్ బాషా, గఫార్, మాడెం సుధాకర్ రెడ్డి, సింగరయ్య, షఫీ, రేగల్లపల్లె భాస్కర్ రెడ్డి, పల్లేటి రాముడు, కొండారెడ్డి, శీను, పిట్టి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో విజయవంతంగా పల్స్ పోలియో..

## జిల్లాలో 93.27 శాతం నమోదు



**కడప కార్పొరేషన్, జూన్ 28 : ప్రభాతవార్త**

వైఎస్ఆర్ కడప జిల్లాలో ఆదివారం నిర్వహిస్తున్న పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. సాయంత్రం 7 గంటల నాటికి ఆన్‌లైన్ నమోదైన వివరాల ప్రకారం జిల్లాలో 2,37,527 మంది చిన్నారులు లక్ష్యంగా ఉండగా, 2,21,552 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయబడినట్లు అధికారులు తెలిపారు. దీంతో 93.27 శాతం లక్ష్యాన్ని జిల్లా సాధించింది. జిల్లాలోని యూపీహెచ్‌సీ పక్కిరిపల్లిలో ఏర్పాటు చేసిన ప్రారంభ పల్స్ పోలియో కేంద్రాన్ని రాష్ట్ర పరిశీలకులు డా. సునీల్ కుమార్ నాయక్, మున్సిపల్ అదనపు కమిషనర్ రాకేష్ చంద్ర, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. రవిబాబు, జిల్లా టీకాల అధికారి డా. ప్రవీణ్ కుమార్ సందర్శించి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఓ రమేష్‌రెడ్డి, సీహెచ్ఓ మునిరెడ్డితో పాటు వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేయించారు. మిగిలిన అర్హులైన ప్రతి చిన్నారికీ పోలియో చుక్కలు వేయించి 100 శాతం లక్ష్య సాధనకు అన్ని వైద్య బృందాలు కృషి చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

# గోపవరం మండలంలో కోట్ల విలువైన

# ప్రభుత్వ భూమి కబ్జా..?

**వీఆర్ఓ పాత్రపై గ్రామస్తుల అనుమానాలు**

**సమగ్ర విచారణకు డిమాండ్**



**బద్వేలు, జూన్ 28, ప్రభాతవార్త:**

బద్వేల్ నియోజకవర్గం లోని గోపవరం మండలంలోని గోపవరం రెవెన్యూ గ్రామంలో ప్రభుత్వ భూమి కబ్జాకు గురైందనే ఆరోపణలు స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. సర్వే నెంబర్లు 16 మరియు 36లో ఉన్న సుమారు 1 ఎకరా 53 సెంట్ల ప్రభుత్వ భూమిని అక్రమంగా ఆక్రమించినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో భూముల ధరలు భారీగా పెరగడంతో ఈ భూమి మార్కెట్ విలువ కోట్ల రూపాయలకు చేరిందని స్థానికులు పేర్కొంటున్నారు.ఈ వ్యవహారంలో స్థానిక వీఆర్ఓ పాత్రపై గ్రామస్తులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కాలంలో రెవెన్యూ అధికారులు సంబంధిత స్థలాల వద్ద ప్రభుత్వ భూమి అంటూ బోర్డులు నాటడంతో సంబంధిత విఆర్ఓ ద్వారా స్థలాలు పొందిన లబ్ధిదారులు లబోదిబోమంటూ తమ బాధను వ్యక్తం చేశారు. అయితే ఆ వీఆర్వో రెవెన్యూ రికార్డుల్లో మార్పులు చేసి ప్రభుత్వ భూమిని ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలోకి వెళ్లేలా సహకరించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఆరోపణలపై ఉన్నతాధికారులు పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని వారు డిమాండ్ చేస్తున్నారు. గ్రామస్తుల కథనం ప్రకారం, గోపవరం మండలంలో గత కొంతకాలంగా ప్రభుత్వ భూములు, నివేశ స్థలాలపై వరుసగా ఆక్రమణలు జరుగుతున్నప్పటికీ రెవెన్యూ అధికారులు సమర్థవంతమైన చర్యలు తీసుకోవడం లేదని విమర్శిస్తున్నారు. అక్రమ ఆక్రమణలపై ఫిర్యాదులు చేసినా స్పందన లేకపోవడం వల్ల ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణపై ప్రజల్లో ఆందోళన పెరుగుతోందని పేర్కొంటున్నారు. ప్రభుత్వానికి చెందిన విలువైన భూములను కబ్జాదారుల నుంచి వెంటనే స్వాధీనం చేసుకుని, రెవెన్యూ రికార్డులను సమగ్రంగా పరిశీలించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ వ్యవహారంలో బాధ్యులెవరో గుర్తించి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ అంశంపై జిల్లా కలెక్టర్‌కు పూర్తి వివరాలతో కూడిన వినతిపత్రం సమర్పించేందుకు గ్రామస్తులు సిద్ధమవుతున్నట్లు సమాచారం. అవసరమైతే సంబంధిత రికార్డులన్నింటినీ పరిశీలించి భూమి యాజమాన్యంపై సమగ్ర విచారణ నిర్వహించాలని వారు కోరుతున్నారు. గోపవరం మండలంలో ప్రభుత్వ భూములు వరుసగా ఆక్రమణలకు గురవుతున్నాయనే ఆరోపణల నేపథ్యంలో రెవెన్యూ శాఖ పనితీరుపై కూడా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వ భూములను పరిరక్షించాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు ప్రభుత్వ ఆస్తులను రక్షించే చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. అయితే, ఈ ఆరోపణలపై రెవెన్యూ శాఖ అధికారులు అధికారికంగా స్పందించాల్సి ఉంది.

# తప్పులు లేని ఓటర్ల జాబితా

# రూపకల్పన సర్ లక్ష్యం

## ఆర్డీవో నారాయణరెడ్డి



**కలికిరి, జూన్ 28, ప్రభాతవార్త:**

తప్పులు లేని ఓటర్ల జాబితా రూపొందించడమే సర్ కార్యక్రమం లక్ష్య మని పీలేరు డివిజన్ ఆర్డీవో నారాయ ణరెడ్డి తెలిపారు. ఆదివారం కలికిరిలోని పలు పోలింగ్ బూతులను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ బీఎల్ఓలు ఇంటింటికి వెళ్లి కార్యక్రమం ఉద్దేశాలు ఓటర్లకు తెలపాల న్నారు. ఎలాంటి సందేహాలకు తావివ్వకుండా బీఎల్ఓలకు సమగ్ర సమాచారం అందించి ఓటర్లు సహక రించాలని కోరారు. ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్లకు ఎమ్యునైజేషన్ ఫారాలు అందజేయాలని కుటుంబ వివ రాలు, నివాస స్థితి, కొత్తగా వచ్చిన వారి వివరాలు కచ్చితంగానమోదు చేయాలన్నారు. బీఎల్ఓలు ఇం టింటికి వెళ్లి ఓటర్లకు ఎమ్యునేజేషన్ ఫారాలు అందించేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ సయిద్ అహ్మద్‌ను ఆదేశించారు. మండలంలో జరుగుతున్న ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంపై ఆర్డీవో సం తృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సయిద్ అహ్మద్, సూపర్‌వైజర్ పుష్పలత, బీఎల్ఓలు పాల్గొన్నారు.

# జీతాల రాకతో సిబ్బందిలో హుషారు



**ప్రొద్దుటూరు క్రైం, జూన్ 28, ప్రభాతవార్త:**

ప్రొద్దుటూరు జిల్లా ఏరియా ఆసుపత్రిలో గత 4నెలలుగా పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు అందలేదు. రెండు రోజుల కిందట 3 నెలల జీతాలు ఒకేసారి రావడంతో కార్తికేయ సూపర్‌వైజర్ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో పరిశుభ్రతకు ప్రధాన్యమిస్తూ పిచ్చి మొక్కలు తొలగించడం జరిగింది. అలాగే మంచి మొక్కలను చూసేందుకు అందంగా తీర్చిదిద్దడం, ఫ్యాన్లకు పేరుకుపోయిన దుమ్ము ధూళిని తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడమే కాకుండా ఎక్కడ చిన్న కాగితం కనబడినా దాన్ని తీసేస్తూ ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూస్తూ ఉండడంతో రోగులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఆదేశంతో కమిటీ ఛైర్మన్ బద్వేల్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తూ పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సిబ్బందిని ఆదేశిస్తున్నారు. అలాగే రోగులు వచ్చినప్పుడు ఆసుపత్రిలో సిబ్బంది మర్యాదగా నడుచుకోవాలని వారికి సరైన వైద్యం అందించాలని డాక్టర్లను, నర్సులను, ఆదేశించారు. ఏది ఏమైనా జీతాల రాకతో ఆసుపత్రి పరిశుభ్రంగా మార్చడం జరిగింది. దీంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# ఐదేళ్లలోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయించాలి

## పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆర్‌డీఓ చిన్నయ్య




**పులివెందుల, జూన్ 28, ప్రభాతవార్త :**

పోలియో మహమ్మారిని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వం చేపట్టిన జాతీయ పల్స్ పోలియో కార్యక్రమం పులివెందుల పట్టణంలో ఘనంగా ప్రారంభమైంది. పట్టణంలోని పాలిరెడ్డి మెమోరియల్ స్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్‌డీఓ) చిన్నయ్య, జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఖాజా మోను ద్దీన్, మలేరియా సబ్ యూనిట్ అధికారి సిద్ధయ్య పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్‌డీఓ చిన్నయ్య మాట్లాడుతూ ఐదేళ్లలోపు వయస్సు ఉన్న ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. భారతదేశం పోలియో రహిత దేశంగా గుర్తింపు పొందినప్పటికీ భవిష్యత్‌లో ఎలాంటి ముప్పు తలెత్తకుండా ముందస్తు చర్యల్లో భాగంగానే పల్స్ పోలియో కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామని తెలిపారు. నియోజకవర్గ పరిధిలో ఒక్క చిన్నారి కూడా మిగిలిపోకుండా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఖాజా మోనుద్దీన్ మాట్లాడుతూ పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామని తెలిపారు. బస్టాండ్లు, వలస కార్మికులు నివసించే ప్రాంతాల్లో మొబైల్ బృందాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మొదటి రోజు పోలియో కేంద్రాలకు రాలేని చిన్నారుల కోసం ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి రాబోయే రెండు రోజుల పాటు చుక్కలు వేస్తారని వివరించారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి సిద్ధయ్య మాట్లాడుతూ వర్షాకాలంలో నీరు నిల్వ ఉండటం వల్ల దోమల వృద్ధి పెరిగే అవకాశం ఉందని, ప్రజలు ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని సూచించారు. రాత్రి వేళల్లో దోమతెరలు ఉపయోగించి వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యశాఖ సూపర్‌వైజర్ కృష్ణవేణి, ఆరోగ్య కార్యకర్త కల్పన, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

### మదనపల్లెలో ఏపీ ప్రభుత్వ పెన్షనర్ల సంఘం డిమాండ్



మదనపల్లెక్రైం, జూన్ 28 ప్రభాతవార్త:

ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని పెన్షనర్ల సంఘం అధ్యక్షులు బి.వి. రమణ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక జి.ఆర్.టి పాఠశాలలో ప్రభుత్వ పెన్షనర్ల సంఘం మదనపల్లె జిల్లా హెడ్ క్వార్టర్స్ యూనిట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బి.వి. రమణ మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే నూతన పి.ఆర్.సి కమిటీని నియమించాలన్నారు. పెన్షనర్లకు 30 మధ్యంతర భృతి చెల్లింపు, బకాయి ఉన్న 4 డి.ఆర్ లు చెల్లించడం, గత ప్రభుత్వం తగ్గించిన అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్ ను పునరుద్ధరించాలన్నారు. పలు తీర్మానాలను సమావేశంలో ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షులు జె. రెడ్డిప్ప, ప్రధాన కార్యదర్శి డా. ఎన్. ముని గోపాలకృష్ణ, ట్రెజరర్ పి.సి. తిమ్మయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శి జగన్ మోహన్, అసోసియేట్ అధ్యక్షులు శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు మురళి, బషీర్, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

## క్షేత్రస్థాయిలో పనిచేయాలనుకునే జనసేన కార్యకర్తలకు ఆహ్వానం

### పార్లమెంట్ అబ్జర్వర్ కలప రవి



పీలేరు, జూన్ 28, ప్రభాతవార్త:

రాజంపేట పార్లమెంటు పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల నుండి జనసేన పార్టీలో క్షేత్రస్థాయిలో పనిచేయాలనే ఆసక్తి ఉన్న ప్రతి జనసేన కార్యకర్త, నాయకులు తమ బయోడేటాను సమర్పించాలని జనసేన పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శి, పీలేరు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ మరియు రాజంపేట పార్లమెంట్ అబ్జర్వర్ కలప రవి విజ్ఞప్తి చేశారు. 29 062026 నుండి రాజంపేట హెడ్‌క్వార్టర్స్ నందు బయోడేటాలను స్వీకరించడం జరుగు తుందని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. కలప రవి మాట్లాడుతూ జనసేన పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసే దిశగా పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టాం. రాజంపేట పార్లమెంట్ పరిధిలోని రాజంపేట, రాయచోటి, కోడూరు, తంబళ్లపల్లె, పీలేరు, మదనపల్లె, పుంగనూరు నియోజకవర్గాల నుండి పార్టీ కోసం చిత్తశుద్ధితో పనిచేయాలనుకునే ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పార్టీకి సేవ చేయాలనే తపన ఉన్న నాయకులు, కార్యకర్తలు పేరుపేరునా తమ పూర్తి వివరాలతో కూడిన బయోడేటాను రాజంపేటలోని పార్టీ కార్యాలయంలో అందజేయాలని కోరుతున్నామని పేర్కొన్నారు.

## కలికిరిలో పల్స్‌పోలియో కార్యక్రమం విజయవంతం



కలికిరి, జూన్ 28, ప్రభాతవార్త:

కలికిరి మండలంలో ఆదివారం మేడికుర్తి వైద్యాధికారిణి కావ్యగంధ పర్యవేక్షణలో జరిగిన పల్స్‌పోలియో కార్యక్రమం విజయవంతం అయింది. వైద్యాధికారిణి కావ్యగంధ 5568 మంది పిల్లలకు గాను 35 బూతులు ఏర్పాటు చేయడం జరిగింది. దీంతో ఆదివారం 5497 మందికి పోలియో చుక్కలు వేయడం జరిగింది. దీంతో 98 శాతం వేయడంతో కార్యక్రమం విజయవంతం అయ్యింది. సోమ, మంగళవారాల్లో కూడా పోలియో చుక్కలు వేయించుకోని వారు తప్పక వేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి ప్రసన్నలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్లు సుధాకర్, గిరిజమ్మ, ఏఎన్ఎం మల్లీశ్వరి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## శక్తిక్షేత్రంలో భక్తుల సందడి



బోయకొండ(చౌడేపల్లి), జూన్ 28 ప్రభాతవార్త

శక్తిక్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసి పోయింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మవారి క్యూలైన్లలో యాత్రికుల రద్దీ కనిపించింది. కొండ దినాన్ని పురస్కరించుకొని ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేకాభిషేకం, అలంకరణ నిర్వహించారు. రాష్ట్రంతోపాటు కర్ణాటక, తమిళనాడుల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. యాత్రికులతో ఆలయ ప్రాంగణం గంగమ్మ నామస్మరణతో మార్మోగింది. ఆలయ ఇఒ, ఉపకమీషనర్ ఏకాంబరం, అధికార, అర్చక సిబ్బంది భక్తులకు సేవలందించారు.

**సామాన్య భక్తులకు ప్రాధాన్యత :**

అమ్మవారి దర్శనానికి సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చే సామాన్య భక్తులకు ప్రాధాన్యత ఇస్తామని ఇఒ, ఉపకమీషనర్ ఏకాంబరం అన్నారు. క్యూలైన్లు, డార్మెంటరీ భవన సముదాయం, ఉచిత ప్రసాద వినియోగం వంటి ప్రాంతాల్లో ఆయన భక్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గర్భాలయంలో క్యూలైన్ల ప్రక్షాళన మూలంగా భక్తులు ఎలాంటి తోపులాటలూ లేకుండా అమ్మవారి దర్శనభాగ్యం కల్గుతోందని ఆయన అన్నారు.

## బ్రాహ్మణ సంక్షేమ సంఘం కార్యవర్గం ఎన్నిక


ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

మదనపల్లె, జూన్ 28 ప్రభాతవార్త :

ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య అన్నమయ్యజిల్లా కార్యవర్గం ఎన్నికలు ఆదివారం నిర్వహించారు. రూరల్ మండలంలోని చిప్పిలి గ్రామం శ్రీ సత్యనారాయణ స్వామి దేవాలయం చిట్టిఅన్నవరం నందు నూతన జిల్లా శాఖ కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించినట్లు జిల్లా సమన్వయకర్త శ్రీమునిగోటి శ్రీనివాసశర్మ తెలిపారు. గౌరవ అతిదులుగా కామకోటి ప్రసాద్‌రావు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గాలి శ్రీనివాసరావు, ట్రెజరర్ సోమేపల్లి ఉమామహేశ్వర్‌లు హాజరయ్యారు. జిల్లా కార్యవర్గసభ్యులు గౌరవ అధ్యక్షులు ప్రకాష్, గౌరవ సమన్వయ కర్తలుగా మునిగోటి శ్రీనివాసశర్మ, నాగభూషణంరావు, జిల్లా సలహాదారునిగా అమరనాథ్‌లు నియామకం అఆయ్యారు.

## ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సన్మానం



రాజుపాలెం, జూన్ 28, ప్రభాతవార్త.

మండల పరిధిలోని కొర్రపాడు గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు సుబ్బయ్య ఆధ్వర్యంలో వాసవి ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఎలైట్ ఫ్యామిలీ ప్రొద్దుటూరు వారు డాన్ టు డస్క్ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ప్రోత్సహించుటకు శాలువాలతో సత్కరించి ఓ ఫైల్‌ను బహుమతిగా అందించి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు కూడా గొప్ప ఆశయాలతో వారి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని బాగా చదవాలని తెలిపారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ వెంకట రామ సుధాకర్, నాగభూషణం, దక్షిణామూర్తి,మహేంద్ర, పద్మనాభం, రాజా వెంకట వరలక్ష్మి, స్వరూప్ కుమార్ తదితరులు పాఠశాల విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# పీలేరులో విస్తృతంగా పల్స్ పోలియో

### బస్టాండ్ నుంచి బండ్లవంక వరకు చుక్కల మందు

### మార్కెట్ యార్డ్ చైర్మన్ రామమూర్తి, ఎంపీడీవో శివశంకర్ పర్యవేక్షణ పలువురు నేతల భాగస్వామ్యం

పీలేరు జూన్ 28 ప్రభాతవార్త:

పీలేరు పట్టణంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు విస్తృతంగా నిర్వహించారు. ఆదివారం నాలుగు రోడ్ల కూడలి, బండ్లవంక, రాములవారి గుడి, మార్గదర్శి డిగ్రీ కళాశాల, యల్లమంద క్రాస్ అంగన్వాడీ కేంద్రం, పంచాయతీ ఆఫీసు, ఆర్టీసీ బస్టాండ్ తదితర ప్రాంతాల్లో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసి ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమంలో పీలేరు వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ పురం రామమూర్తి, ఎంపీడీవో శివశంకర్ పాల్గొని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీలేరు నియోజకవర్గ శాసనసభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి సూచనలతో పోలియో రహిత భారతదేశం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి. పీలేరు పట్టణంలో ఒక్క చిన్నారి కూడా తప్పి పోకుండా ఇంటింటి సర్వే చేసి చుక్కలు వేస్తున్నాం. ప్రభుత్వ లక్ష్యాన్ని చేరుకునేందుకు ప్రజలు, అధికారులు కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా పాత బస్టాండ్‌లోని మెయిన్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన కేంద్రంలో స్పెషల్ ఆఫీసర్ యుగంధర్, క్లస్టర్ ఇన్‌చార్జ్ ఇస్మాయిల్ షౌకత్ బుజ్జు, మనోహర తదితరులు పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేయించారు. పీలేరు నియోజకవర్గ గ్రామ గ్రామాన ఉదయం నుండి వైద్య సిబ్బంది కూటమి నాయకులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమంలో కొనసాగుతుంది. ఈ కార్యక్రమాల్లో శ్రీ అంకాలమ్మ ఆలయ చైర్మన్ కోడి రామకృష్ణారెడ్డి, టీడీపీ ప్రముఖ నేత పోలిశెట్టి సురేంద్ర సావల సూరి, వైద్య సిబ్బంది, చంద్రశేఖర్, కుసుమ, ఆశా కార్య కర్తలు, అంగన్వాడీ టీచర్లు, స్థానిక నాయకులు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


పల్స్ పోలియో చుక్కలు వేస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ పురం రామ్మూర్తి

## శ్రీ మల్లికార్జున స్వామి ఆలయ నిర్మాణానికి భూమి పూజ

### శ్రీవాణి ట్రస్ట్ నిధులతో రూ.20 లక్షల వ్యయంతో నిర్మాణం

గాలివీడు, జూన్28. ప్రభాత వార్త.

మండల కేంద్రంలోని పెద్దారు బ్రాహ్మణవీధిలో శ్రీ మల్లికార్జున స్వామి ఆలయ నిర్మాణానికి వేదపండితులు నాగఫణి కిషోర్ శర్మ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం శాస్త్రోక్తంగా భూమి పూజ నిర్వహించారు. ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు, భక్తులు, గ్రామ పెద్దలు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ, తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) శ్రీవాణి ట్రస్ట్ ద్వారా మంజూరైన రూ.20 లక్షల నిధులతో ఆలయ నిర్మాణ పనులను చేపట్టినట్లు తెలిపారు. భక్తులకు ఆధ్యాత్మిక కేంద్రంగా నిలిచేలా ఆలయాన్ని అన్ని సౌకర్యాలతో నిర్మించనున్నట్లు పేర్కొన్నారు.ఈ నిధుల మంజూరుకు ప్రత్యేక చొరవ తీసుకున్న రాష్ట్ర క్రీడలు, రవాణా, యువజన సేవల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, ఆయన సోదరుడు మండిపల్లి లక్ష్మీప్రసాద్ రెడ్డికి ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.ఆలయ నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసి, భక్తుల దర్శనార్థం అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తామని కమిటీ సభ్యులు వెల్లడించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## రూ.20 లక్షలతో అంకెవానిపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ పునరుద్ధరణ

### 250 ఎకరాలకు భూగర్భ జలాల పెంపు
### పండ్ల తోటలకు ఊరట
### రైతుల కోరికకు స్పందించిన బీటెక్ రవి


లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ ని ప్రారంభిస్తున్న దృశ్యం

పులివెందుల, జూన్ 28,ప్రభాతవార్త :

చాలా రోజులుగా అసంపూ ర్తిగా నిలిచిపోయిన పులివెందుల బ్రాంచ్ కెనాల్ పరిధిలోని బలపనూరు డిస్ట్రిబ్యూటరీకి చెందిన అంకెవానిపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ రైతుల కోరిక మేరకు పునరుద్ధరించబడింది. పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్సీ మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి (బీటెక్ రవి) సుమారు రూ.20 లక్షల వ్యయంతో పనులు పూర్తి చేయించి, సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా బీటెక్ రవి మాట్లాడుతూ రైతుల సాగు అవసరాలను దృష్టిలో ఉంచుకుని లిఫ్ట్ ఇరిగేషన్‌ను వినియోగంలోకి తీసుకువచ్చా మని తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా అంకెవానిపల్లి, కామసముద్రం గ్రామాల పరిధిలోని రైతులకు ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు.లిఫ్ట్ ఇరిగేషన్ అందుబాటులోకి రావడంతో ఆయా గ్రామాల పరిధిలోని సుమారు 250 ఎకరాల భూముల్లో భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉందని, ముఖ్యంగా అరటి, చీని తదితర పండ్ల తోటలకు నీటి ఇబ్బందులు తగ్గి రైతులు తమ పంటలను కాపాడుకు నేందుకు వీలవుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో తుంగభద్ర ప్రాజెక్టు హైలెవెల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి, సింహాద్రిపురం మాజీ జడ్పీటీసీ పోరెడ్డి ప్రభాకర్ రెడ్డి, లింగాల మండల టీడీపీ ఇన్‌చార్జి సంజీవ రెడ్డి, మండల అధ్యక్షుడు విశ్వనాథ రెడ్డి, పులివెందుల మార్కెట్ యార్డ్ చైర్మన్ గడ్డం అమర్నాథ్ యాదవ్, మాజీ పట్టణ అధ్యక్షులు మద్దూరి వెంకట్రామిరెడ్డి తదితర కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు మదనపల్లె కలెక్టరేట్‌లో పిజిఆర్‌ఎస్

మదనపల్లె, జూన్ 28 ప్రభాతవార్త :

మదనపల్లె కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 10గంటల నుంచి ప్రజాసమస్యల పరిష్కార వేదిక(పిజిఆర్‌ఎస్) నిర్వహించనున్నట్లు కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రజలు ప్రజాసమస్యలపై పిజిఆర్‌ఎస్‌లో ఆధారాలతో కూడిన అర్జీలను సమర్పించాలని కోరారు. అర్జీలపై సమాచారం కొరకు మీ కోసం కాల్‌సెంటర్ నెంబర్ 1100 లను సంప్రదించాలన్నారు. అర్జీదారులు తమ అర్జీలను సంబంధిత గ్రామ, మండల, డివిజన్‌లలో అధికారులకు కూడా ఇవ్వవచ్చని సూచించారు. మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రాగలరని తెలిపారు.

## ద్వారకనాథ్‌రెడ్డికి ఎంపీ మిథున్‌రెడ్డి భరోసా



కలికిరి, జూన్ 28, ప్రభాతవార్త:

కలికిరి మండలం వైసీపీ ప్రధాన కార్యదర్శి అయిన కంభం ద్వారకనాథ్‌రెడ్డికి రాజంపేట పార్లమెంటు ఎంపీ వెంకట మిథున్‌రెడ్డి తానున్నానంటూ భరోసా ఇచ్చారు. కలికిరి మండలం గుట్టపాలెం పంచాయతీ దిగువకంభం వారిపల్లికి చెందిన కంభం ద్వారకనాథ్‌రెడ్డి వైసీపీ ప్రధాన కార్యదర్శిగా ఉంటూ మాజీ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి, పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆదేశాల మేరకు వైసీపీ ఏ కార్యక్రమం చేపట్టాలన్నా ముందుండి పార్టీ కార్యక్రమాలు విజయవంతం చేస్తున్నారు. గుట్టపాలెం పంచాయతీలో వైసీపీ బలోపేతానికి కృషి చేస్తున్నారు. ఆదివారం తిరుపతిలో ఎంపీని తన అనుచరులతో వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. దీంతో ఎంపీ మిథున్‌రెడ్డి మాట్లాడుతూ కంభం ద్వారకనాథ్‌రెడ్డి చేపడుతున్న కార్యక్రమాలు, పేద ప్రజలకు చేస్తున్న సేవా కార్యక్రమాలపై ద్వారకనాథ్‌రెడ్డిని అభినందించారు. నీకు తాను, వైసీపీ అండగా ఉంటుందని వైఎస్‌ఆర్ సీపీ బలోపేతానికి కృషి చేయాలని ద్వారకనాథ్‌రెడ్డికి సూచించారు. ఎంపీని కలిసిన వారిలో రామకృష్ణారెడ్డి, విశ్వనాథయ్య, చెంగయ్య, బాలకృష్ణ, లోకనాథ్‌రెడ్డి, వాహిద్, రాజగోపాల్, బాలాజీ భీమయ్య, మోహన్, కుమార్, వెంకటేష్, అశోక్ తదితరులు ఉన్నారు.

## చలో విజయవాడను జయప్రదం చేయండి

### యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సురేష్‌కుమార్



మదనపల్లె, జూన్ 28 ప్రభాతవార్త :

కార్మికుల సమస్యల పరిష్కారం కోసం జూలై 7న తలపెట్టిన ఛలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రాష్ట్ర మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వర్రి సురేష్‌కుమార్ తెలిపారు. ఆదివారం మున్సిపల్ కార్యాలయంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్ళు అవుతున్నా కార్మికుల సమస్యలను ఏమాత్రం పరిష్కరించలేదన్నారు. సమస్యలు పరిష్కరించాలని అధికారులకు, ప్రభుత్వానికి విన్నవిస్తున్నా ప్రయోజనం లేకపోతోందన్నారు. జూన్ 20నుంచి దశలవారి కార్యక్రమాలను మున్సిపల్, కార్పోరేషన్ నగర పంచాయతీల ఎదుట చేపట్టి చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి దేవేంద్ర, మస్తాన్‌లు మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్య తీసుకోవాలన్నారు. ప్రభుత్వ రంగంలో పనిచేస్తున్న పర్మనెంట్, కాంట్రాక్టు అవుట్‌సోర్సింగ్ కార్మికులకు గ్రాడిటి చెల్లించాలన్న చట్టాన్ని ప్రభుత్వం లెక్కచేయడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున, కదిరప్ప, తిరుమలప్ప, ఇంద్రాణి, అల్లాభక్షు, రాధా, జానకమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## కేజీబీవీ ఉపాధ్యాయినీల సమస్యలు పరిష్కరించాలి

### కేజీబీవీ రాష్ట్ర కార్యదర్శి దేవానంద రెడ్డికి యుటియఫ్ కడప జిల్లా శాఖ వినతి



కాశి నాయన జూన్ 28 ప్రభాతవార్త :

కేజీబీవీ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయినీల సమస్యలను పరిష్కరించాలని కేజీబీవీ రాష్ట్ర కార్యదర్శి డి.దేవానంద రెడ్డికి యుటిఎఫ్ కడప జిల్లా శాఖ విజ్ఞప్తి చేసింది.ఆదివారం ఉదయం కేజీబీవీ పాఠశాలల కార్యదర్శి దేవానందం రెడ్డి కాశీనాయన మండలంలోని కొండ్రాజు పల్లెకు విచ్చేసిన సందర్భంగా ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీ రాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబులు మాట్లాడుతూ కెజిబివి పాఠశాలల్లో పనిచేస్తున్న సిబ్బంది చాలీచాలని జీతాలతో పనిచేస్తూ, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వారికి మినిమం టైం స్కేల్ వర్తింపచేయాలని కోరారు. ఈ సందర్భంగా కేజీబీవీ రాష్ట్ర కార్యదర్శి డి.దేవానందరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయినీల బదిలీల విషయంలో కోర్టు తీర్పు విషయాన్ని ప్రభుత్వంతో చర్చించి, సంబంధిత ఉపాధ్యాయినీలకు తగు న్యాయం చేస్తామన్నారు. మిగతా సమస్యల పట్ల కూడా సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు కుర్రా చెన్నయ్య, కె.ప్రసాద్ డి.సుబ్బారావు, కె.సుధాకర్, జిల్లా మాజీ అధ్యక్షులు ఎస్ ఓబుల్ రెడ్డి, జిల్లా మాజీ కార్యదర్శి జోజయ్య, కేజీబీవీ ఉపాధ్యాయినీలు తదితరులు పాల్గొన్నారు.

## ఆక్రమణలపై కలెక్టర్ కొరడా

మొదటి పేజీ తరువాయి


ప్రభుత్వ భూములు స్వాధీనం చేసుకున్నామని మాట్లాడుతున్న తాసిల్దార్ దస్తగిరయ్య, ప్రభుత్వ భూమి స్వాధీనం చేసుకొని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన రెవెన్యూ

నివేదిక ప్రకారం శ్రీరంగరాజుపురం, ఆకేపాడు, మందపల్లి, శేషమాంబ పురం నాలుగు రెవెన్యూ గ్రామాల పరిధిలో ఆకేపాటి అమర్నాథరెడ్డి , ఆకేపాటి అనిల్ కుమార్ రెడ్డి,ఆకేపాటి శ్రీనివాసులు రెడ్డి (మురళిరెడ్డి)లు ఆక్రమించిన భూములను సుమారు 350 ఎకరాలు గుర్తించినట్లు తెలిసింది. 350 ఎకరాలలో ఆక్రమణలు తొలగించి స్వాధీనం చేసుకునే దిశగా జిల్లా కలెక్టర్ సిద్ధం చేసినట్లు ద్వారా తెలిసింది.

## మదనపల్లెలో జూలై 1న వైద్యుల దినోత్సవ వేడుకలు



మదనపల్లెక్రైం, జూన్ 28 ప్రభాతవార్త.

రాష్ట్రవ్యాప్తంగా జూలై 1వ తేదీన నిర్వహించబోయే జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని, మదనపల్లె డివిజన్ పరిధిలో వైద్యుల దినోత్సవ సభను ఘనంగా నిర్వహిం చునున్నట్లు ప్రవేట్ వైద్యుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కుమార్ తెలిపారు. మదనపల్లె గొల్లపల్లి బైపాస్ రోడ్డులో ఉన్న ఆర్.ఆర్. కళ్యాణ మండపంలో జూలై 1వ తేదీ బుధవారం ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమోతుందని అసోసియేషన్ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ ఈ వేడుకలకు స్థానిక శాసనసభ్యులు ముఖ్య అతిథిగా విచ్చేస్తుండగా, స్టేట్ ఫెడరేషన్ నాయకులు, ఉమ్మడి చిత్తూరు జిల్లా నలుమూలల నుంచి గ్రామీణ వైద్యులు భారీ సంఖ్యలో తరలిరానున్నారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ప్రాథమిక వైద్య సేవలు అందిస్తున్న ఆర్.ఎమ్.పి, పి.ఎమ్.పి వైద్యుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడమే ఈ సభ యొక్క ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ సభలో వైద్యుల నైపుణ్యాన్ని, పనితీరును మరింత మెరుగు పరిచేందుకు దాదాపు 10 మంది క్వాలిఫైడ్ నిపుణులైన డాక్టర్లతో ప్రత్యేక అవగాహన, ఓరియంటేషన్ తరగతులను కూడా నిర్వహించనున్నట్లు స్పష్టం చేశారు. గ్రామీణ, ప్రైవేట్ వైద్యులందరూ సకాలంలో హాజరై జయప్రదం చేయాలని అసోసియేషన్ నాయకులు పత్రికాముఖంగా పిలుపునిచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో అసోసియేషన్ నాయకులు యమలా సుదర్శన్, ఫెడరేషన్ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం అధ్యక్షులు పోల్తి ప్రతాప్ రావు, ఆదినారాయణ, రామాంజనేయులు, మధు, అరుణమ్మ, పసుపులేటి శంకర, సాంబ, ఎ. అనంత బాబు తదితరులు పాల్గొన్నారు.

## స్త్రీ శక్తి భవనం లో సైబర్ నేరాలపై డ్వాక్రా మహిళలసభ్యులకు అవగాహన



రామసముద్రం, జూన్ 28, ప్రభాతవార్త :

సైబర్ నేరాలు పట్ల మహిళలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై హృషికేశవరెడ్డి సూచించారు. ఆదివారం స్త్రీ శక్తి భవనంలో ఏ పీ ఎం సాంబశివ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిధిగా ఎస్సై పాల్గొన్నారు,ఎస్సై మహిళలకు సైబర్ నేరాలు, ఆన్లైన్ మోసాలు, ఓటిపి లు, డేటింగ్ యాప్, సోషియల్ మీడియా పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహిళలు తెలియని నెంబర్ ల నుంచి ఫోన్ కాల్ వస్తే వారికి పూర్తి సమాచారం ఇవ్వకుండా జాగ్రత్త పడాలన్నారు. అపరిచిత వ్యక్తులు ఇన్స్టాగ్రామ్, ఫేస్ బుక్‌లో రిక్వెస్ట్ లు పెడితే అనుమతించారాదన్నారు. మీ పిల్లలపై జాగ్రత్తగా ఉండాలని, వారి చరవాణి ఎవ్వరితో మాట్లాడుతున్నారో తెలుసుకోవాలని, గుర్తు తెలియని వ్యక్తుల వాహనాలు ఎక్కరాదని తెలిపారు. మహిళలకు ఉన్న చట్టాల గురించి అవగాహన పెంపొందించుకోవాలన్నారు.మీ గ్రామాల్లో బెల్ట్ షాఫ్ లు, పేకాట ఆడేవారు ఉంటే మాకు తెలియపరచాలని మీ ఫోన్ నెంబర్లు గొప్యంగా ఉంచుతామన్నారు,ఈ కార్యక్రమంలో ఎస్సై హృషికేశవరెడ్డి, ఏ పి ఎం సాంబశివ, హెడ్ కానిస్టేబుల్ శాంతకుమారి,సి సి శ్రీనివాసులు షాన్ వాజ్, గుణశేఖర్, డ్వాక్రా సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఉబ్బ దేవర మహోత్సవం



పీలేరు, జూన్ 28, ప్రభాతవార్త:

పీలేరులోని శ్రీ సాయిబాబా రజక సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం తిరుపతి మార్గంలోని నూతన దోబీ ఘాటు వద్ద ఉబ్బ దేవర మహోత్సవం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సకాలంలో వర్షాలు సమృద్ధిగా కురిసి, వాగు వంకల్లో నీళ్లు అందుబాటులోకి వచ్చి, తమ కుల వృత్తికి ఆటంకం లేకుండా చూడాలని రజకులు భగవంతుని ప్రార్థిస్తూ ఉబ్బ దేవర మహోత్సవం చేయడం ఆనవాయితీ. ఈ ఏడాది వర్షాలు తక్కువగా ఉన్నందున రజక సేవా సంఘం సభ్యులు సమిష్టిగా ఉబ్బదేవర మహోత్సవాన్ని నిర్వహించారు. ఉబ్బ దేవర కారణంగా ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని వారు విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సాయిబాబా రజక సేవా సంఘం గౌరవ సలహాదారులు అనిల్, అధ్యక్షులు పి.వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి కిరణ్, ఉపాధ్యక్షులు నాగార్జున, కోశాధికారి సిద్దయ్య, కార్యదర్శి కే.వెంకటరమణ, సభ్యులు రమణ, మల్లికార్జున, లతా, ఉషారాణి, ప్రమీలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## నిండైన జీవితానికి రెండే చుక్కలు




చౌడేపల్లి, జూన్ 28 ప్రభాతవార్త

నిండైన జీవితానికి రెండే చుక్కలని మండల వైద్యాధికారిణి మోనా తెలిపారు. ఆదివారం స్థానిక ఉన్నత పాఠశాలలో చిన్నారులకు పోలియే చుక్కలు వేసి ప్రారంభించారు. 19పంచాయతీల్లోని 5మార్గాల ద్వారా 4849మంది పిల్లలకు లక్ష్యంగా 50కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. అంతేకాకుండా బోయకొండ, ప్రధాన కూడళ్ళల్లోనూ కేంద్రాలు ఏర్పాటు చేసి పోలియో చుక్కలు వేసినట్లు వివరించారు. తక్కిన వారికి ఇంటింటికీ వెళ్ళి భాగస్వాములుగా చేస్తామన్నారు. ఫల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, సిబ్బందిని ఆమె అభినందించారు. పంచాయతీ గ్రామాల్లో పలువురు తేదేపా, భాజాపా నాయకులు పిల్లలకు పోలియో చుక్కలు వేసారు.

## నిండు జీవితానికి రెండే చుక్కలు

### చిన్నారుల భవిష్యత్తుకు శ్రీరామరక్ష పల్స్ పోలియో: గండికోట సుధాకర్



రాయచోటి జూన్ 28 ప్రభాతవార్త:

చిన్నారుల ఉజ్వల భవిష్యత్తుకు శ్రీరామరక్ష పోలియో చుక్కలు అని రాయచోటి మండల రూరల్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గండికోట సుధాకర్ అన్నారు. ఆయన ఆదివారం చెన్నముక్క పల్లి గ్రామం రాజుల కాలనీ లో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి,టిడిపి నియోజకవర్గం నాయకులు డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్ రెడ్డి,యువనాయకులు మోర్యా రెడ్డి ల ఆదేశాలు మేరకు ఐదేళ్లలోపు చిన్నారులను పోలియో మహమ్మారి నుంచి కాపాడేందుకు ఉద్దేశించిన పల్స్ పోలియో కార్యక్రమం లో సంబంధిత అధికారులతో కలిసి చిన్నారులకు పోలియో చుక్కలు వేసారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకప్పుడు ఎంతో మంది చిన్నారులను అంగవైకల్యం పాలుచేసిన పోలియో మహమ్మారిని తరిమికొట్టడంలో "పల్స్ పోలియో" కార్యక్రమం కీలక పాత్ర పోషించిందన్నారు. ఐదేళ్ల లోపు చిన్నారులందరికీ రెండు చుక్కల పోలియో మందు వేయడం ద్వారా, మన దేశం ఇప్పటికే పోలియో రహిత దేశంఖిగా ప్రపంచ ఆరోగ్య సంస్థ నుంచి గుర్తింపు పొందిందన్నారు.ఈ మహమ్మారి మళ్లీ మన దరిచేరకుండా ఉండాలంటే ప్రతి విడతలోనూ చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలనీ ప్రజలను కోరారు.

## రాయలసీమ లిఫ్ట్ఇరిగేషన్ కమిటీ సభ్యునిగా వివిఎస్.రెడ్డి



మదనపల్లె, జూన్ 28 ప్రభాతవార్త :

రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్, ప్రాజెక్టుల సాధన అన్నమయ్య జిల్లా టాస్క్‌పోర్స్ కమిటీసభ్యునిగా వివిఎస్.రెడ్డిని నియామకం చేస్తూ జిల్లా టాస్క్‌పోర్స్ కమిటి ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఈ భాద్యతను అప్పగించిన వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపి మిథున్ రెడ్డి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. రాయలసీమకు సాగునీటి హక్కులు, లిఫ్ట్ఇరిగేషన్ ప్రాజెక్టుల సాధన, పెండింగ్ ప్రాజెక్టుల పూర్తి, ప్రాంత అభివృద్ది లక్ష్యంగా చేపట్టే కార్యక్రమాల్లో పూర్తిస్థాయిలో భాగస్వామ్యం అవుతానని తెలిపారు. అనంతరం జిల్లా అధ్యక్షులు ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ నిస్సార్‌అహ్మద్, మాజీ ఎమ్మెల్యే తిప్పారెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. తాను ఇప్పటికే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో మేథావుల ఫోరం రాష్ట్ర కార్యదర్శిగా పనిచే స్తున్నట్లు తెలిపారు.

# ప్రిన్సిపల్ రంతు భాష సేవలు ఆదర్శనీయం

**వేంపల్లి జూన్ 28 ప్రభాతవార్త**

చక్రాయపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేసి పదవీ విరమణ పొందుతున్న షేక్ రంతు భాష సేవలు ప్రశంసనీయమని పశ్చిమ రాయలసీమ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం చక్రాయపేటలోని రాచరాయ వీరభద్ర స్వామి దేవస్థాన కళ్యాణ మండపం నందు జరిగిన పదవీ విరమణ సన్మాన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఆయన సేవలు ఆదర్శనీయమన్నారు. 2014లో ఈ కళాశాల ప్రిన్సిపాల్‌గా వచ్చిన వారీ యొక్క ఆవిరళల కృషి వలన కళాశాలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంలో గాని, విద్యార్థుల ఎన్రోల్మెంట్ పెంచడంలో గాని ప్రజాప్రతినిధులను, సమాజాన్ని కలుపుకొని ముందుకు తీసుకెళ్లారన్నారు. స్థానికంగా నివాసం ఉంటూ పూర్తి సమయము కళాశాల విద్యార్థుల కోసం పరితపించారని మరికొన్ని సంవత్సరాలు వారు సేవలు అందించి ఉంటే కళాశాల మరింత అభివృద్ధి చెందేది అన్నారు. అలాగే ఈ కళాశాలలో అనేక చిన్న చిన్న గ్రామాల నుంచి, సుదూర ప్రాంతాల నుంచి విద్యార్థులు వచ్చి పోవడానికి ఇబ్బందిగా ఉన్నందున కళాశాలకు అనుసంధానంగా ఒక హాస్టల్ ఏర్పాటు చేయుటకు ప్రభుత్వంతో ప్రాతినిధ్యం చేసి మంజూరు చేయిస్తానని వారు భరోసా ఇచ్చారు. కళాశాల అవసరాల కోసం అభివృద్ధి కోసం ఎవరు తన దృష్టికి తెచ్చిన నేనెప్పుడూ అందుబాటులో ఉండి నా శాయశక్తుల కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర, వీరభద్ర దేవస్థాన చైర్మన్ మోపురి రామాంజనేయరెడ్డి, అడ్వకేట్ అపస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామాంజనేయ ప్రసాద్, అన్నమయ్య జిల్లా డిఐఈఓ రవి, పులివెందుల, కడప, గండి గురుకుల ప్రిన్సిపాల్ లు శ్రీనివాసులు, సూర్యరావు, దివాకర్ రెడ్డి, సురేంద్రబాబు, జి జె సి గవర్నమెంట్ పోరుమామిళ్ల జిల్లా అసోసియేషన్ ప్రెసిడెంట్ రామిరెడ్డి, రామకృష్ణారెడ్డి, కొలిమల్ల జివిటి వెంకటసుబ్బయ్య, కాలేజీ సిబ్బంది, బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా మాజీ ప్రధాని పీవీ జయంతి



**ప్రొద్దుటూరు అర్బన్ జూన్ 29 ప్రభాతవార్త**

మాజీ ప్రధాని పి.వి. నరసింహారావు భారత రాజకీయ చరిత్రలో అత్యంత ప్రభావశీలమైన ప్రధాన మంత్రుల్లో ఒకరని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసుల రెడ్డి పేర్కొన్నారు. పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా ఆదివారం ప్రొద్దుటూరులోని ఉపాధ్యాయ సేవా కేంద్రంలో ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఒంటేరు శ్రీనివాసుల రెడ్డి మాట్లాడుతూ, పీవీ నరసింహారావు బహుభాషా కోవిదుడిగా, దూరదృష్టి కలిగిన రాజనీతిజ్ఞుడిగా దేశానికి విశేష సేవలు అందించారని కొనియాడారు. అనంతరం పీవీ నరసింహారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని దేశాభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయులు భాస్కర్‌రావు, సుధాకర్, సంజీవరెడ్డి, గురివిరెడ్డి, గంగాధర్, కెపి ఓబులరెడ్డి అధ్యాపకులు రమణ, గౌరీశంకర్ పాల్గొన్నారు.

# వైభవంగా మొహరం వేడుకలు



**బ్రహ్మంగారిమఠం జూన్ 28 ప్రభాతవార్త**

మండలంలోని సోమిరెడ్డిపల్లి, వీరబ్రహ్మేంద్ర నగర్, గుండాపురం, రాజుపేట, గ్రామాలలో (పీర్ల పండుగ) మొహరం పండుగ వైభవంగా నిర్వహించారు. సోమిరెడ్డిపల్లి లో శనివారం పెద్ద సరిగేసు లో పెద్ద పీరయ్యా స్వామికి పిల్లలు లేని మహిళలు స్వామి ఒరపడి మొక్కులు తీర్చుకున్నారు. వివిధ ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి తమ ముక్కుబడులు తీర్చుకున్నారు. కుల మతాలకు అతీతంగా గ్రామంలోని ప్రజలు ఎంతో ఉత్సాహంతో ఈ కార్యక్రమం లో పాల్గొన్నారు. ఆదివారం సాయంత్రం పెద్ద పీరయ్యా స్వాములవారు అగ్నిగుండ ప్రవేశం నిర్వహించారు.

# ఏటి గంగమ్మను దర్శించుకున్న అతికారి కృష్ణ

**సిద్ధవటం, జూన్ 28 ప్రభాతవార్త**

మండలంలోని భాకరాపేట గ్రామ శివారులో వెలిసిన శ్రీశ్రీశ్రీ ఏటి గంగమ్మ అమ్మవారిని ఆదివారం రాజంపేట జనసేన పార్టీ పార్లమెంట్ సమన్వయకర్త అతి కారి కృష్ణ అమ్మవారిని దర్శనం చేసుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు ఆయనకు ఆలయ సంప్రదాయాలతో డప్పు వాయిద్యాల మధ్య బాణాసంచా పేలుస్తూ ఘన స్వాగతం పలికి శాలువతో సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి సహకరిస్తానని ప్రతి ఒక్కరికి అమ్మవారి అనుగ్రహం ఉండాలని సూచించారు టిడిపి సీనియర్ నేత మాజీ పార్లమెంట్ ఉపాధ్యక్షులు పుత్త రామచంద్రయ్య మాట్లాడుతూ ఏటి గంగమ్మ అమ్మవారి దేవస్థానం అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించి సహకరించాలన్నారు అమ్మవారి అనుగ్రహం ఉంటుందని సూచించారుఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ ప్రతినిధి దేరంగుల శ్రీకాంత్ రాష్ట్ర జనసేన చేనేత వికాస కార్యదర్శి రాటాల రామయ్య, టిడిపి అసెంబ్లీ అధికార ప్రతినిధి రామ్మోహన్ నాయుడు ఏఎంసి డైరెక్టర్ మహబూబ్ బాషా మాజీ సింగల్ విండో అధ్యక్షుడు సుధా మురళి, విజయ్, పసుపులేటి గంగయ్య నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.



# 94 శాతం తో పల్స్ పోలియో విజయవంతం



**బ్రహ్మంగారిమఠం, జూన్ 28 ప్రభాతవార్త**

పల్స్ పోలియో భాగంగా ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియోలో మండలంలో 94 శాతంగా నమోదయిందని హెల్త్ సూపర్వైజర్ పుష్పరాజ్ తెలియజేశారు. మండలంలో మొత్తం 46 బూతులకు గాను 4173 మంది పిల్లలు ఉండగా అందులో ఈరోజు 3909 మంది పిల్లలకు పల్స్ పోలియో బూతులలో ఈరోజు 0 నుంచి 5 ఏండ్ల పిల్లలకు చుక్కలు వేసినట్లు ఆయన తెలియజేశారు. జిల్లాలోనే టాప్ టెన్ లో బి.మఠం పీహెచ్సీ ఉండడం వల్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. మండలంలో మొత్తం 5 రూట్లకు గాను 198 మంది సిబ్బంది పాల్గొని ఈ పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేశారని ఆయన తెలియజేశారు. అలాగే ఆంధ్రప్రదేశ్ లోనే మన జిల్లా పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం చేయడంలో 11వ స్థానంలో ఉండడం కూడా గర్వించదగ్గ విషయమని ఆయన అన్నారు.

# క్రీడలు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలకు పునాది




**పులివెందుల, జూన్ 28, ప్రభాతవార్త :**

క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయి.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి ఉన్నత శిఖరాలను చేరుకోవాలి" అని పులివెందుల సీఐ శ్రీరామ్ అన్నారు. క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి జాతీయ స్థాయికి ప్రోత్సహించడమే లక్ష్యంగా కడప జిల్లా కౌన్సిల్ ఫర్ స్పోర్ట్స్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో పులివెందుల ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన 1వ ఆంధ్రప్రదేశ్ అండర్ 14, అండర్19 బాలబాలికలు, సీనియర్ పురుషులు, మహిళల అంతర్ జిల్లా కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్ 2026 ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఐ శ్రీరామ్ మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించే మనస్తత్వం పెరుగుతుందని, యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి పోటీలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. అనంతరం కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షులు బి. మురళి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మనోహర్ రెడ్డి, జాయింట్ సెక్రటరీ రమేష్ నాయక్, ఆర్గనైజింగ్ సెక్రటరీ రాచవేటి తేజేంద్ర మాట్లాడుతూ క్రీడల ద్వారా విద్యార్థుల్లో ఆరోగ్యకరమైన పోటీతత్వం పెరుగుతుందని తెలిపారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు భవిష్యత్తులో మరిన్ని అవకాశాలు లభిస్తాయని అన్నారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు పార్టిసిపేషన్, మెరిట్ సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. విజేతలు జాతీయ స్థాయి పోటీల్లో కూడా అత్యుత్తమ ప్రదర్శన కనబరచాలని ఆకాంక్షించారు. విజేతలకు అర్బన్ సీఐ శ్రీరామ్ మెడల్స్ ను ట్రోఫీలను అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోచ్ లు తల్లిదండ్రులు క్రీడాకారులు క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అతిథి అధ్యాపకులు ఎమ్ ఎల్సి కు వినతి

**వేంపల్లి: జూన్ 28 ప్రభాతవార్త**



కడప జిల్లా చక్రాయపేట జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ పదవి విరమణ సందర్భంగా విచ్చేసినటువంటి ముఖ్యఅతిథి అయిన పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి అతిథి అధ్యాపకులు, లీప్ యాప్ ను అతిథి ఆధ్యాత్మిక మినహాయింపు ఇవ్వాలని. గంటల మాదిరిగా కాకుండా నెల వారీగా కన్సల్డేట్ పే చేయాలని. డిస్టర్బ్ అయిన అతిథి అధ్యాపకులకు వెంటనే కౌన్సిలింగ్ నిర్వహించి ప్లేస్మెంట్ ఇవ్వాలనే మంచి విషయాలతో కూడిన వినతి పత్రాన్ని ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి కు అతిథి ఆధ్యాపకుల జనరల్ సెక్రటరీ అంజాద్ అలీ ఆధ్వర్యంలో చక్రాయపేట, వేముల కళాశాలకు సంబంధించిన అధ్యాపకులు సతీష్ రెడ్డి, గంగయ్య, రాజమోహన్ రెడ్డి, సుధీర్, మమత, సుగుణా లు అందించడం జరిగింది. ఈ విషయాల మీద ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి సానుకూలంగా స్పందించి ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్ళి మీ సమస్యకు పరిష్కారం చేస్తానని తెలియజేశారు.

# రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

**ముద్దనూరు, జూన్ 28 (ప్రభాతవార్త):**



మండలంలోని ఓబులాపురం గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పెనికలపాడు గ్రామానికి చెందిన శివకృష్ణారెడ్డి (30) మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం, శివకృష్ణారెడ్డి తన అత్తగారి ఊరైన ఓబులాపురం గ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా, అతని ముందు వెళ్తున్న టిప్పర్ లారీ అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో అదుపు తప్పిన ద్విచక్రవాహనం టిప్పర్ వెనుక భాగాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందాడు.

# బైకు ప్రమాదంలో దంపతులకు గాయాలు

**ఒంటిమిట్ట జూన్.28. (ప్రభాతవార్త)**



ఒంటిమిట్ట మండలం కొత్త మాధవరం కడప చెన్నై ప్రధాన రహదారిలోని మల్లేశ్వరపురం చెక్పోస్ట్ వద్ద ఆదివారం రోడ్డు ప్రమాదం సంబంధించినది. తెలిసిన వివరాల మేరకు కడప నగరం బుద్ధాయిపల్లి కు చెందిన మనీ(30) రాధ(25) అనే దంపతులు నందలూరు సౌమ్యనాథ స్వామిని దర్శించుకుని బైకులో తమ స్వస్థలానికి వెళ్తున్న సమయంలో దురదృష్టవశాత్తు మల్లేశ్వరపురం వచ్చేసరికి కడప నుండి తిరుపతి వైపుకు వెళుతున్న కారు బైకును ఢీకొట్టడంతో ఇరువురికి గాయాలవడంతో అధిక రక్తస్రావం అయింది. సమాచారం తెలుసుకున్న హైవే పెట్రోల్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని గాయాలతో బాధపడుతున్న క్షతగాత్రులను మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం 108 వాహనంలో కడప రిమ్స్ కు తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# పాపాఘ్ని నదిలో గుర్తు తెలియని శవం

**వేంపల్లి జూన్ 28 ప్రభాతవార్త**



మండలంలోని గండి దేవస్థానం సమీపంలోని పాపాఘ్నదిలో ఆదివారం గుర్తుతెలియని శవం ఉన్నట్లు సమాచారం రావడంతో ఆర్కే వ్యాలీ సిఐ శంకర్ రెడ్డి, చక్రాయపేట ఎస్ఐ చంద్రశేఖర్ గుర్తు తెలియని శవాన్ని పరిశీలించారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఎవరికైనా తెలిసి ఉంటే సమాచారం ఇవ్వాలని వారు తెలిపారు. గత మూడు, నాలుగు రోజుల క్రితం మృతి చెందినట్లు గుర్తించారు. శవాన్ని పోస్టుమార్టం అనంతరం అంత్యక్రియలు జరిపి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీ ప్రియ తెలిపారు.

# సేవలకు గుర్తింపుగా స్వచ్ఛ సేవా రత్న అవార్డు

**నందలూరు జూన్ 28 ప్రభాతవార్త :**



రాజంపేట కళాంజలి కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నందలూరు మండలంలో ఎన్నో సంవత్సరాలుగా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న రాయల్ సేవ సమితి అధ్యక్షుడు గంగనపల్లి శ్రీనివాసులకు "ది బెస్ట్ సోషల్ సర్వీస్ – స్వచ్ఛ సేవా రత్న అవార్డు" ప్రదానం చేశారు. ఈ అవార్డును రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. భవిష్యత్తులో రాయల్ సేవ సమితి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

# పోలియో మహమ్మారిని తరిమికొడదాం

**మైదుకూరు, జూన్ 28, ప్రభాతవార్త:**

పోలియో రహిత జీవితం కోసం పిల్లలకు రెండు చుక్కలు అనే నినాదంతో మైదుకూరు పట్టణంలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమం విస్తృతంగా నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలోని శారద స్కూల్ ఏరియాలో ఆశా వర్కర్ రమణమ్మ ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు. 0 నుండి 5 సంవత్సరాల లోపు చిన్నారులకు తల్లిదండ్రుల సమక్షంలో పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం సునీత తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వం పల్స్ పోలియో కార్యక్రమంపై ముందుగానే విస్తృత ప్రచారం నిర్వహించడంతో తల్లిదండ్రుల నుంచి మంచి స్పందన వచ్చింది. ఆదివారం పట్టణంలోని అనేక ప్రాంతాల్లో పెద్ద ఎత్తున చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. పోలియోను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమానికి ప్రజలు సహకరించాలని వైద్య సిబ్బంది కోరారు.



# రెండు గ్రామాల మధ్య ఘర్షణ

## - 15 మందికి గాయాలు



**బద్వేలు, జూన్ 28, ప్రభాతవార్త**

గోపవరం మండల పరిధిలోని రెండు గ్రామాల మధ్య జరిగిన వివాదం ఘర్షణకు దారితీసి పలువురు గాయపడిన ఘటన చోటుచేసుకుంది. చెర్లో రామాపురం కోలాటం వద్ద ప్రారంభమైన చిన్నపాటి వివాదం క్రమంగా పెరిగి పెద్ద ఘర్షణగా మారినట్లు స్థానికులు తెలిపారు. ఈ ఘటనలో ఇరువర్గాల మధ్య తోపులాట, రాళ్లదాడి జరిగినట్లు సమాచారం. ఈ ఘర్షణలో సుమారు 15 మంది వరకు గాయపడినట్లు తెలుస్తోంది. గాయపడిన వారిని వెంటనే బద్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. సమాచారం అందుకున్న వెంటనే బద్వేల్ రూరల్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

# వేంపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో

# పల్స్ పోలియో కార్యక్రమం



**వేంపల్లె: జూన్ 28 ప్రభాత వార్త**

స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో చుక్కల కార్యక్రమంలో జనసేన పార్టీ పార్లమెంటు సమాచార సేకరణ కమిటీ సభ్యుడు డాక్టర్ దాసరి రవిశంకర్ సిబ్బందితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన చిన్నారులకు స్వయంగా పోలియో చుక్కలు వేశారు. ఐదేళ్ల లోపు చిన్నారులందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. పోలియో రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు, నర్సులు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఉదయం నుంచి ఆసుపత్రికి వచ్చిన చిన్నారులకు సిబ్బంది పోలియో చుక్కలు వేశారు.

# అనంతసాయి మహా సంగ్రామము జయప్రదం చేయండి

**ప్రొద్దుటూరు అర్బన్ జూన్ 28 ప్రభాతవార్త**

కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (దిశీళీ) ను తక్షణమే రద్దు చేయాలనే ప్రధాన డిమాండ్‌తో, రాబోయే జూలై 11వ తేదీన అనంతపురంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించ తలపెట్టిన "అనంత సిపిఎస్ మహాసంగ్రామం" బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరుతూ ప్రొద్దుటూరులోని ఏపీ సిపిఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కార్యాలయంలో ఘనంగా పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏపీ సిపిఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి శ్రీయపురెడ్డి వెంకట జనార్ధన రెడ్డి, స్టేట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు సోమశేఖర్ రెడ్డి, మరియు ఏపీ సిఎస్‌పిఎ జిల్లా ప్రధాన కార్యదర్శి హరీంద్ర ముఖ్య అతిథులుగా హాజరై, పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర నేతలు మాట్లాడుతూ, ఉద్యోగ, ఉపాధ్యాయుల సుదీర్ఘకాల ప్రాతిపదికన ఉన్న సిపిఎస్ రద్దు డిమాండ్‌ను సాధించుకోవడానికి అనంతపురంలో జరగబోయే మహాసంగ్రామం ఒక దిక్సూచిలాంటిదన్నారు. హక్కుల సాధన కోసం ఉద్యోగులంతా ఏకతాటిపైకి వచ్చి, ఈ సభకు భారీ సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీ సిపిఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రముఖ సభ్యులు ప్యాపిలి నాగ చంద్రుడు, పాలెం కేశవ రెడ్డి, వాదనపల్లె మస్తాన్ వల్లి, రామి రెడ్డి హుసేన్ రెడ్డి, భక్త నరసింహ, గండికోట బాబా, షేక్ రోషన్ జమీర్, ఈశ్వరయ్య, పోలు నాగేంద్ర రెడ్డి, బాల నారాయణ స్వామి, కఠారి పీరయ్య, కల్లూరు సుబ్బారెడ్డి, కోటా ఓబులరెడ్డి, పుల్లా రెడ్డి, సోషల్ స్టడీస్ ఫోరం ధర్మకర్ భాస్కర్ రావు తదితర సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# వికలాంగులకు నిత్యావసరాల పంపిణీ



**పులివెందుల, జూన్ 28, ప్రభాత వార్త :**

ప్రజల సంక్షేమం కోసం చేసిన సేవా కార్యక్రమాలే మనిషిని చిరకాలం గుర్తుండేలా చేస్తాయని ఫిజియోథెరపీ వైద్యులు సాయి కిషోర్, వికలాంగుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షులు ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి పేర్కొన్నారు. పులివెందుల పట్టణంలో ప్రముఖ వ్యాపారిగా పేరుగాంచిన కొంగనపల్లె పిండిమిషన్ నారాయణ ఐదో వర్ధంతి సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు దివ్యాంగులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. పులివెందుల పట్టణం ముద్దనూరు రోడ్డులోని వికలాంగుల కమ్యూనిటీ భవనంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ముందుగా కొంగనపల్లె నారాయణ చిత్రపటానికి కుటుంబ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొంగనపల్లె శ్రీనివాసులు, ఆయన కుమారుడు ఫిజియోథెరపిస్టు సాయికిషోర్ ఆధ్వర్యంలో 25 మంది దివ్యాంగులకు బియ్యం, ఇతర నిత్యావసర వస్తువులను అందజేశారు. నారాయణ జ్ఞాపకార్థం దివ్యాంగులకు అండగా నిలిచిన కొంగనపల్లె కుటుంబ సభ్యులను ఈ సందర్భంగా పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో కొంగనపల్లె శ్రీనివాసులు, కృష్ణవేణి, సాయికిషోర్, సుస్మిత, యశ్వంత్ తదితర కుటుంబ సభ్యులతో పాటు వికలాంగుల నెట్‌వర్క్ ప్రతినిధులు కొండయ్య, వెంకట నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# పూర్వపు విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**పెండ్లిమర్రి, జూన్ 28, ప్రభాతవార్త:**

నందిమండలం హైస్కూలు పూర్వపు విద్యార్థులు 1998-99 విద్యా సంవత్సరంలో 10వ తరగతి పూర్తి చేసుకున్న వారు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. విద్యార్థి దశలోని మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ పూర్వ విద్యార్థులు భావోద్వేగాలకు లోనయ్యారు. హెడ్మాస్టర్ ఈశ్వర్‌రెడ్డి, మాజీ హెడ్మాస్టర్ రవీంద్రారెడ్డిలు మాట్లాడుతూ ఇలాంటి సమ్మేళనాలు విద్యా సంస్థ ప్రతిష్టను పెంపొందించడమే కాకుండా భావితరాలకు స్ఫూర్తినిస్తాయని వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామచంద్రయ్య, గాయత్రి, కోటా సుబ్బరాయుడు, సూర్యనారాయణరెడ్డి, పార్వతి, రాజారెడ్డి, పూర్వపు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# నిండు జీవితానికి రెండు చుక్కలు

**పులివెందుల, జూన్ 28, ప్రభాత వార్త :**

దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా పులివెందులలో చిన్నారులకు శ్రీనివాస అభ్యుదయ పాఠశాలలో పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రముఖ రామతులశమ్మ నర్సింగ్ హోమ్ చిన్నపిల్లల వైద్య నిపుణులు మరియు నేత్ర సేకరణ కేంద్రం మెడికల్ అధికారి డాక్టర్ రవీంద్ర రెడ్డి, స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు మొమ్మెల రాజు కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవీంద్ర రెడ్డి మాట్లాడుతూ నిండు జీవితానికి రెండు చుక్కలు ఎంతో అవసరం. ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించడం ద్వారా పోలియో రహిత సమాజ నిర్మాణం సాధ్యమవుతుంది అని తెలిపారు. ఐదేళ్లలోపు వయస్సు గల ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు ఆయన విజ్ఞప్తి చేశారు. పోలియో వంటి ప్రమాదకర వ్యాధులను పూర్తిగా నిర్మూలించడంలో పల్స్ పోలియో కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తుందని, కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని వారు కోరారు. ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించడం ఆరోగ్యవం తమైన భారతదేశ నిర్మాణానికి మనందరి బాధ్యత అని డాక్టర్ రవీంద్ర రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ సురేష్, ఏఎన్ఎం సునీత, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు అందజేశారు.



# రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలి

**బద్వేల్, జూన్ 28, ప్రభాతవార్త**



బి.కోడూరు మండలంలోని ఆక్రమిత ప్రభుత్వ భూముల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంలో జాప్యం చేస్తున్న రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ జిల్లా స్టాండింగ్ కమిటీ సభ్యుడు ఎస్. చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఆదివారం బి.కోడూరు మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత వారం దప్పిలమ్మ నుంచి ఐత్రంపేట వరకు ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న కామకుంట, పాయలకుంట్ల, కాసానగరం, వేముకుంట, మున్నెల్లి గ్రామాలతో పాటు చెన్నకేశవపురం గ్రామంలోని ప్రభుత్వ భూములపై సుమారు 200 ఎకరాలకు పైగా జరిగిన ఆక్రమణలకు సంబంధించిన పూర్తి ఆధారాలు, సర్వే నంబర్లతో కూడిన వినతిపత్రాన్ని ఈ నెల 22న మండల తహసీల్దార్‌కు, 23న ఆర్డీవోకు అందజేసినట్లు తెలిపారు. దీనిపై స్పందించిన ఆర్డీవో ఆక్రమిత ప్రభుత్వ భూముల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి, వారం రోజుల్లో విచారణ నివేదిక సమర్పించాలని తహసీల్దార్‌కు ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. అయితే వారం రోజులు గడిచినా ఒక్కచోట కూడా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం, ఆర్డీవో ఆదేశాలను సైతం అమలు చేయకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. ఆర్డీవో వెంటనే స్పందించి ఆదేశాలను అమలు చేయని అధికారులపై చర్యలు తీసుకోవాలని, లేకపోతే ఈ నెల 30న బద్వేల్‌లో జరగనున్న "ఒక నియోజకవర్గం–నాలుగు పర్యటన" సందర్భంగా పూర్తి ఆధారాలతో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ బి.కోడూరు మండల కార్యదర్శి ఎస్. మార్క్, కే. దానం తదితరులు పాల్గొన్నారు.

# మానవత సమీక్ష సమావేశం

**పీలేరు జూన్ 28 ప్రభాతవార్త:**

స్థానిక మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు శెట్టి సుబ్రహ్మణ్యం అధ్యక్షతన చైర్మన్ డా:వి. రామచంద్ర ఆధ్వర్యంలో నెలవారి సమీక్ష సమావేశం నిర్వహించబడింది .గత సమావేశంలో ఏర్పాటు చేసిన నూతన కమిటీ సభ్యులందరూ హాజరైనారు. ఆ సమావేశం నిర్ణయించిన ప్రకారము నూతన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జూలైనెల మొదటివారంలో చేపట్టుటకు నిర్ణయించారు. చేపట్టిన, రాబోయే నెలలో చేయబోయే కార్యక్రమాలు చర్చించడం జరిగింది. పీలేరు మార్కెట్ యార్డ్ నందు స్థలం ఎమ్మెల్యే అనుమతితో తీసుకుని అక్కడ షెడ్డు వేయుటకు ప్రయత్నాలు చేస్తున్న ప్రయత్నం సఫలం కావాలని కోరుచున్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా మిన్నల రెడ్డి గంగాధరంరెడ్డి, వై వెంకట రమణ ,కృష్ణమూర్తి సభ్యులు రహత్ భాష, జగన్మోహన్, ప్యారుఖాన్, అక్రమ భాష కలియుముల్లా ,ఎం నాగరాజ, పెన్షనర్ అశోక్, విజయ మహేష్ ,జాకీర్ భాష ,తదితరులు పాల్గొన్నారు.

# నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు అవసరం

**పీలేరు జూన్ 28 ప్రభాతవార్త:**

పీలేరు మండలం పోలియో మహమ్మారిని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని టీడీపీ పీలేరు మండల ప్రధాన కార్యదర్శి పసుపులేటి లక్ష్మీకర పిలుపునిచ్చారు. పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం మండలంలోని ఎర్రగుంట్లపల్లి గ్రామం చౌడేశ్వరి నగర్‌లో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కల మందు వేశారు. ఈ సందర్భంగా పసుపులేటి లక్ష్మీకర మాట్లాడుత దేశం నుంచి పోలియోను తరిమికొట్టాలన్న సంకల్పంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నాయి. మన ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెడ్డి గారి సూచనలతో నియోజకవర్గ వ్యాప్తంగా ఈ కార్యక్రమం విజయవంతంగా జరుగుతోంది. ఒక్క చిన్నారి కూడా మిస్ కాకుండా అందరికీ చుక్కలు వేయిస్తున్నాం. తల్లిదండ్రులు నిర్లక్ష్యం చేయకుండా తమ పిల్లలకు తప్పనిసరిగా వేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు దిన చంద్రారెడ్డి, ప్రభాకర్ రాజు రెడ్డి శేఖర, స్థానిక నాయకులు, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పోలియో చుక్కలు వేస్తున్న పసుపులేటి లక్ష్మీకర

## ముగిసిన మొహరం వేడుకలు

**దువ్వూరు, జూన్ 28, ప్రభాతవార్త:**



మండల పరిధిలోని వివిధ గ్రామాలలో ముస్లిం సోదరులు జరుపుకునే మొహరం వేడుకలు ఆదివారం తో ముగిశాయి. ఆదివారం కృష్ణంపల్లె, భాకరాపురం, జిల్లెల్ల, పెద్దసింగన పల్లె తదితర గ్రామాల్లో పది రోజుల పాటు పీర్లను ఉంచి ప్రార్థనలు నిర్వహించిన పీర్లను ఆదివారం ఊరేగించారు. అన్నిచోట్ల పీర్లు ఏటికి వెళ్లి అనంతరం తమ స్థావరాలకు చేరుకున్నాయి. అలాగే మండల కేంద్రమైన దువ్వూరులోని బాదుల్లా పీరు వద్ద ఆదివారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మొహరం వేడుకల సందర్భంగా అన్నిచోట్ల ఎస్ఐ ధనుంజయుడు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

## శ్రీ వీరభద్రస్వామి దేవస్థానములో ఏరువాక పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు



**రాయచోటి జూన్ 28 ప్రభాతవార్త**

అన్నమయ్య జిల్లా, రాయచోటి పట్టణములో వెలసినశ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి దేవస్థానములో ఏరువాక పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించబడనున్నాయని ఆలయ కమిటీ చైర్మన్ మనోజ్ కుమార్, ఆలయ ఈవో రమణారెడ్డిలు తెలిపారు. వారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉదయం గోమాతకు గోపూజ నిర్వహించబడుతుందన్నారు. అనంతరం వ్యవసాయ రంగానికి శుభారంభంగా భావించే ఏరువాక పౌర్ణమి విశిష్టతను భక్తులకు, రైతులకు వివరించి, శ్రీ స్వామివారి అనుగ్రహం పొందాలని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించబడతాయి. తదనంతరం విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేయబడతాయన్నారు. ఈ పవిత్రమైన గోపూజకు భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి వారి దివ్య దర్శనం చేసుకొని స్వామివారి అనుగ్రహాన్ని పొందవలసిందిగా వారు కోరారు. ఈ సందర్భంగా పంటలు సమృద్ధిగా పండాలని, రైతులు సుఖసంతోషాలతో ఉండాలని, రాష్ట్ర ప్రజలందరికీ ఆయురారోగ్య ఐశ్వర్యాలు కలగాలని శ్రీ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించబడనున్నట్లు పేర్కొన్నారు.

### శాశ్వతంగా పోలియో నిర్మూలనే

# టిడిపి ప్రభుత్వ ధ్యేయం



**కడప కార్పొరేషన్ జూన్ 28 ప్రభాతవార్త:**

పోలియో రహిత సమాజాన్ని నిర్మించాలన్నదే సీఎం చంద్రబాబు నాయుడు ధ్యేయమని మాజీ డిప్యూటీ మేయర్ అరిఫుల్లా, పేర్కొన్నారు. ఆదివారం కడప బండ్లమిట్ట వీధి నందు ఐదు సంవత్సరముల లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా అరిఫుల్లా మాట్లాడుతూ రాష్ట్రంలో 49.90 లక్షల పిల్లలకు పోలియో డ్రాప్స్ వేయుటకు 29.90 లక్షల పోలియో కేంద్రాలను తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. 1.39 లక్షల సిబ్బందినీ పోలియో డ్రాప్స్ వేయుటకు నీమించారన్నారు. ఈ కార్యక్రమాన్ని అంగన్‌వాడీ ఉపాధ్యాయులు కె.లక్ష్మి దేవి, ఆశా వర్కర్లు మల్లిక, లక్ష్మి ప్రసన, సుబ్బమ్మ పాల్గొన్నారు.

# చిన్నారులకు చుక్కలు వేసి ప్రారంభించిన టీడీపీ నేత

**వేంపల్లి, జూన్ 28 ప్రభాతవార్త**

జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ఆదివారం స్థానిక పుల్లయ్య తోటలో పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమం అత్యంత ఉత్సాహభరితంగా సాగింది. ఈ కార్యక్రమానికివిచ్చేసిన తెలుగుదేశం పార్టీ (టిడిపి) ప్రముఖ నేత దేవర్ల చంద్రశేఖర్ రెడ్డి (దిల్ మాంగే) చిన్నారికి స్వయంగా పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఐదేళ్లలోపు వయసున్న ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. సమాజాన్ని పోలియో రహితంగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారాన్ని అందించాలని ఆయన పిలుపునిచ్చారు. తల్లిదండ్రులు ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా సమీపంలోని పోలియో కేంద్రాలకు తమ పిల్లలను తీసుకువచ్చి చుక్కలు వేయించాలని సూచించారు. ఆరోగ్య శాఖ సిబ్బంది, సి.హెచ్.ఓ శంకరమ్మ, ఏఎన్ఎం కుమారి మరియు ఆశా కార్యకర్త అందరూ ఎంతో సమన్వయంతో పనిచేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, చిన్నారుల తల్లిదండ్రులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## 135వ మన్ కీ బాత్ కార్యక్రమం





**బద్వేల్, జూన్ 28, ప్రభాతవార్త**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్వహించే నెలవారీ రేడియో కార్యక్రమం మన్ కీ బాత్ 135వ ఎపిసోడ్‌ను ఆదివారం బద్వేల్ పట్టణంలో బీజేపీ యువమోర్చా (బీజేవైఎం) రాష్ట్ర కార్యదర్శి బొమ్మన విజయ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రధాని సందేశాన్ని ఆసక్తిగా విన్నారు. అనంతరం బొమ్మన విజయ్ మాట్లాడుతూ దేశ రక్షణ, ఆత్మనిర్భర భారత్, సామాజిక భద్రతా పథకాలపై ప్రధాని మోదీ చేసిన సూచనలు యువతకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని అన్నారు. కష్టకాలంలో దేశ ప్రజలు ప్రధాని పిలుపునకు స్పందిస్తున్న తీరు అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బద్వేల్ బీజేపీ నాయకులు ధరిమిచెట్టి వెంకటసుబ్బయ్య రాయల్, భాస్కర్ రెడ్డి, యువమోర్చా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కేజీబీవీ ని ఆకస్మిక తనిఖీ చేసిన డైరెక్టర్ దేవానందరెడ్డి

**కలసపాడు, జూన్ 28 ప్రభాతవార్త:**

మండలంలోని పెండ్లిమర్రి దగ్గర గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంను ఆదివారం ఉదయం కేజీబీవీ రాష్ట్ర డైరెక్టర్ డి.దేవానందరెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు.అల్పాహార సమయం కావడంతో విద్యార్థినులతో కలిసి అల్పాహారం తీసుకోవడంతో పాటు,మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా? లేదా? అని విద్యార్థులను విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు.మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం తయారు చేసి పిల్లలకు అందేలా చూడాలని డ్యూటీ టీచర్ నారాయణమ్మ మరియు వంటఏజెన్సీని ఆదేశించారు. పాఠ్యపుస్తకాల సరఫరా,ఇతర సామాగ్రి అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. విజయపథం అమలు తీరు, ఫలితాల గురించి ఇన్చార్జితో మాట్లాడారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. విద్యార్థినులంతా బాగా చదివి భవిష్యత్తులో మంచి ఉన్నత స్థాయిలో ఎదగాలని ఆకాంక్షి ంచారు.

**కెజిబివి స్కూల్, సిబ్బంది సమస్యలు పరిష్కరించండి**

బాలికల విద్యాభివృద్ధికి ఎంతగానో దోహదపడుతున్న కేజీబీవీ స్కూల్స్ మరియు అందులో పనిచేస్తున్న బోధన,బోధనేతర సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ ఎలిమెంటరీ టీచర్స్ ఆర్గనైజేషన్ (ఏఐఎఫ్ఇటిఓ)జాతీయ కార్యదర్శి పి.రమణారెడ్డి కేజీబీవీ తనిఖీకి విచ్చేసిన రాష్ట్ర డైరెక్టర్ డి.దేవానందరెడ్డిని కోరారు. భారీవర్షాల కారణంగా కూలిపోయిన కలసపాడు కేజీబీవీ ప్రహరీగోడ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. ప్రధాన రహదారికి పక్కనే ఉండడంతో బాలికల భద్రత దృష్ట్యా వీలైనంత త్వరగా నిర్మాణ పనులు చేపట్టి పూర్తి చేయాలన్నారు. ఉద్యోగ భద్రతలో భాగంగా రెగ్యులరైజేషన్ మరియు మినిమం టైం స్కేల్ వర్తింపు సమస్యలను పరిష్కరించినప్పుడే బోధనా సిబ్బంది ఉత్సాహంగా పని చేస్తారన్నారు.అదేవిధంగా మిగిలిన ప్రభుత్వ పాఠశాలల మాదిరిగా కేజీబీవీ బోధనా సిబ్బందికి ఆప్షనల్ హాలిడేస్, లోకల్ హాలిడేస్,తదితర సెలవుల మంజూరులో జిల్లా అధికారులు సరిగా స్పందించకపోవడంతో స్పెషల్ ఆఫీసర్లు, సిఆర్టీలు, పీజీటీలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను డైరెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. కేజీబీవీలలోని బోధన, బోధనేతర సిబ్బంది ఖాళీలను పూర్తిచేసేలా తగుచర్యలు చేపట్టాలని కోరారు. కేజీబీవీ డైరెక్టర్ దేవానందరెడ్డి స్పందిస్తూ ప్రహరీగోడ నిర్మాణానికి అధికారుల ప్రతిపాదనల ప్రకారం నిధులు మంజూరు చేసేలా చర్యలు చేపడతామన్నారు.కేజీబీవీ సిబ్బంది సెలవుల మంజూరు విషయంలో నిబంధనలు పాటించేలా జిల్లా అధికారులకు సూచిస్తామన్నారు. మిగిలిన సమస్యలను కూడా పరిష్కరించడానికి తమ పరిధిలో తమ వంతు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ డిప్యూటీ డిఎంహెచ్ఓ డి.మార్కారెడ్డి, ఎస్టీయు జిల్లా కమిటీ కన్వీనర్ బి.ఎన్.వి.ప్రసాద్, డ్యూటీ టీచర్ ఎన్.నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.



## శిల్పారామంలో అలరించిన నృత్యాలు..



**కడప కార్పొరేషన్ జూన్ 28 ప్రభాతవార్త:**

కడప శిల్పారామంలో సా. 6:30 సాంస్కృతి కళావేదిక పైన పద్మాకర్ సహకారంతో చిత్తూరు జిల్లా చెందిన బైరెడ్డిపల్లె చెందిన కళాతరంగని డాన్స్ అకాడమీ బృందం.. పల్లె జానపద, శాస్త్రీయ నృత్యాలతో, సినీ చెప్పులతో ప్రేక్షకులను అలరించాయి. వనలాడి టిక్కులాడే, రింగ్ జుట్టుదానా, ఆయుధ పూజ మసాజాతర్ ఒంటి పాటలకు స్టెప్స్ వేశారు. సాంస్కృతిక కార్యక్రమాలను శిల్పారామం పరిపాలనా అధికారి పి.శివ ప్రసాద్ రెడ్డి పర్యవేక్షించారు.

## క్రీడా పోటీలలో విద్యార్థుల ప్రతిభ



**ప్రొద్దుటూరు అర్బన్, జూన్ 28 ప్రభాతవార్త**

పులివెందులలో నిర్వహించిన ఇంటర్‌డిస్ట్రిక్ట్ క్రీడా పోటీలలో గీతాంజలి హైస్కూల్, ప్రొద్దుటూరు బుడాయపల్లె విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారని పాఠశాల కరస్పాండెంట్ ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాడ్మింటన్ లో ప్రథమ స్థానం పొంది బంగారం పథకం సాధించారని, కబడ్డీలో రన్నర్‌గా నిలిచి ప్రతిభ కనబరిచారు అన్నారు. తమ పాఠశాలలో విద్యుత్‌తో పాటు క్రీడలు కూడా సమాన ప్రాధాన్యత ఉంటుందని భవిష్యత్తులో మరెన్నో విజయాలు సాధించాలని విద్యార్థులను కోరారు. విజేతలైన విద్యార్థులకు, క్రీడా ఉపాధ్యాయులకు, సహకరించిన తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు.

# కులమతాలకతీతంగా మస్తాన్స్వామి పీరు ఉత్సవం

### పులివెందులలో వైభవంగా మొహర్రం వేడుకలు... భక్తిశ్రద్ధలతో పాల్గొన్న హిందూ, ముస్లిం సోదరులు

**పులివెందుల , జూన్ 28, ప్రభాతవార్త :**

కులమతాలకతీతంగా భక్తి, సోదరభావానికి ప్రతీకగా నిలిచే మొహర్రం పండుగ వేడుకలు పులివెందుల పట్టణంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలో ఎంతో ప్రాచుర్యం పొందిన మస్తాన్ స్వామి పీరు ఉత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. జెండామాను వీధిలోని పీర్ల చావిడిలో మస్తాన్ స్వామి పీర్లను ప్రత్యేకంగా కొలువుదీర్చి పూలతో అందంగా అలంకరించారు. ప్రత్యేక పూజల అనంతరం పీర్లను అగ్ని గుండ ప్రవేశం చేయించి భక్తిశ్రద్ధలతో గ్రామోత్సవాన్ని నిర్వహించారు. ఉత్సవంలో భాగంగా పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని తమ మొక్కులు చెల్లించుకున్నారు. డప్పు వాయిద్యాలు, డీజే సంగీతంతో యువత సందడి చేయగా, ఉత్సవం మార్గమంతా పండుగ వాతావరణం నెలకొంది. మస్తాన్ స్వామి పీరు తమ ఇంటి ముందుకు చేరుకున్న సమయంలో భక్తులు చెక్కర చదివింపులు సమర్పించి, పూలతో పీర్లను అలంకరించారు. మొక్కులు తీర్చుకునేందుకు పలువురు భక్తులు వెండి గొడుగులు సమర్పించగా, చెక్కర చదివింపుల అనంతరం వాటిని భక్తులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు.పీర్ల ఊరేగింపు జెండామాను వీధి నుంచి గాడిచర్ల వీధి, అమ్మవారిశాల, మెయిన్ బజార్, పూలంగళ్ల సర్కిల్ మీదుగా సాగింది. మార్గమంతా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవానికి ఘన స్వాగతం పలికారు.పులివెందులలో ప్రతి ఏడాది జరిగే మస్తాన్ స్వామి పీరు ఉత్సవం అతిపెద్ద వేడుకగా గుర్తింపు పొందింది. హిందూ, ముస్లిం సోదరులు కలిసి ఈ ఉత్సవాన్ని నిర్వహించడం పట్టణంలోని మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోంది.





## పల్స్ పోలియో విజయవంతం



**ఒంటిమిట్ట జూన్.28. ప్రభాతవార్త**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆదేశాల మేరకు ఉన్నత స్థాయి వైద్యాధికారులు ప్రతి మండలంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న నేపథ్యంలో వారి ఆదేశాల మేరకు ఆదివారం ఒంటిమిట్ట మండలంలో కిందిస్థాయి వైద్య సిబ్బంది పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించారు. ప్రధానంగా మండల కేంద్రం ఒంటిమిట్ట మెయిన్ బస్టాండు, శ్రీ కోదండ రామాలయం, మెయిన్ బజార్‌లోని అమ్మవారి శాల ప్రధాన కూడళ్లలో శిబిరాలు ఏర్పాటు చేయడం జరిగింది. మండల ప్రజల సౌకర్యార్థం అన్ని పంచాయతీల్లో వైద్య సిబ్బంది శిబిరాలు ఏర్పాటు చేశారు. వైద్యాధికారిని భావన, అదనపు వైద్యాధికారిని అరుణ జ్యోతి శిబిరాలను పర్యవేక్షిస్తూ 0 నుంచి 5 సంవత్సరముల లోపు చిన్నారులకు రెండు చుక్కల పోలియో మందు వేసి విజయవంతంగా పూర్తి చేశారు. మండల వ్యాప్తంగా దాదాపుగా 2300 చిన్నారులు ఉండగా 2306 మంది 98.84 శాతం చిన్నారులకు వైద్య సిబ్బంది పోలియో చుక్కలు వేయడం జరిగింది. ప్రజలందరూ తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించుకొని సద్వినియోగం చేసుకున్నారు.

## పల్స్ పోలియో విజయవంతం



**దువ్వూరు, జూన్ 28, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని 15 గ్రామ సచివాలయాల పరిధిలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతమైనట్లు డాక్టర్ షేక్ రోషిని, వికసితలు తెలిపారు. దువ్వూరు మండలంలోని దువ్వూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అలాగే చింతకుంట ఆరోగ్య కేంద్రం పరిధిలో మొత్తం 5663 మంది 5 సంవత్సరముల లోపు పిల్లలు ఉండగా వారిలో 5551 మందికి పోలియో చుక్కలు వేశామన్నారు. మండలంలో 98 శాతం పోలియో చుక్కల కార్యక్రమం విజయవంతమైనట్లు తెలిపారు. మిగతా వారికి సోమ, మంగళ వారాల్లో గుర్తించి పోలియో చుక్కలు వేస్తామన్నారు. అలాగే ఆర్టీసీ బస్టాండు, జనం ఉండే చోట్లలో కూడా పోలియో చుక్కల కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది రాజగోపాల్, శివ గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రొద్దుటూరు రోటరీ నూతన కార్యవర్గం ఏర్పాటు

**ప్రొద్దుటూరు అర్బన్, జూన్ 29 ప్రభాతవార్త**

స్థానిక గాంధీ రోడ్డు లోని రోటరీ క్లబ్ సభా భవనంలో ఆదివారం రోటరీ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా కొవ్వు రమేష్ రెడ్డి మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా సుమారు 202 దేశాలలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సేవలు కొనసాగుతు న్నాయన్నారు. రోటరీ అధ్వర్యంలో పోలియో చుక్కలు, పేదలకు ఉచిత నేత్ర వైద్య సేవలు, పేద విద్యార్థులకు ఉచిత పుస్తకాల పంపిణీ, వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని రోటరీ సేవలు ఇంకా విస్తృత పరుస్తామన్నారు. పిడిజి రొటేరియన్ కె. శ్రీరామ మూర్తి మాట్లాడుతూ రోటరీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లాకు 10 కోట్ల గ్రాంటు మంజూరైందని, దీంతో నూతన కార్యక్రమాలు చేపట్టి పేద ప్రజలకు సేవ చేయాలని సూచించారు. పిడిజి రొటేరియన్ కె.రామలింగారెడ్డి మాట్లాడుతూ రోటరీ క్లబ్ గ్లోబల్ గ్రాంట్ తో జిల్లాలో అవసరమైన చోట రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆర్ ఓ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసి, త్రాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. ఆయనతో పాటు కార్యదర్శిగా గండ్లూరు శ్రీధర్ ప్రమాణ స్వీకారం చేశారు. మాజీ జిల్లా గవర్నర్ కె. రామమూర్తి నూతన అధ్యక్షుడు, కార్యదర్శితో పాటు కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. దొంతు బాలాజీ కోశాధికారిగా, వెంకటేష్ సార్జెంట్ అట్ ఆర్మ్స్‌గా బాధ్యతలు స్వీకరించగా, ఇతర సభ్యులను వివిధ పదవుల్లో నియమించారు. అనంతరం జి.బి. మధుసూదన్ రెడ్డి, రమణ ఆచారి, శ్రీరాములు, వెంకటేశ్వర్లు రోటరీ క్లబ్ కొత్త సభ్యులుగా చేరారు. వారికి సహాయ జిల్లా గవర్నర్ కె. వెంకట మురళీధర్ రెడ్డి, డాక్టర్ ఆజాద్, జిల్లా గవర్నర్ ఎలెక్ట్ తవ్వ సుధీర్ కుమార్ రెడ్డి, మాజీ జిల్లా గవర్నర్ ఎం.వి.ఎస్. ప్రభు రోటరీ పిన్ అందజేసి సభ్యత్వంలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జమ్మలమడుగు రోటరీ క్లబ్ సభ్యులు, రాయలసీమలోని వివిధ రోటరీ క్లబ్‌ల ప్రతినిధులు, రోటరాక్ట్ సభ్యులు, ఇన్నర్ వీల్ సభ్యులు, బాల సూర్యారావు, తాండవ కృష్ణ, కమ్మర మల్లికార్జున, గుర్రం రామకృష్ణ, మహమ్మద్ అయూబ్ ఖాన్, సాధు కృష్ణ సందీప్, డాక్టర్ ఓబులేష్, పెంచలయ్య, మురుకుటి సూర్య నారాయణ రెడ్డి, వడ్డి రవికుమార్, కొవ్వూరు రవికుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## పల్స్ పోలియోలో టీడీపీ నేత కోన సుబ్బారావు

**మైదుకూరు, జూన్ 28, ప్రభాతవార్త:**

మైదుకూరు పోలియో రహిత సమాజమే మన లక్ష్యం అనే నినాదంతో మున్సిపాలిటీ 4వ వార్డు రాయప్పగారిపల్లిలో పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించారు. మైదుకూరు శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ గారి ఆదేశాల మేరకు టీడీపీ నాయకులు కోన సుబ్బారావు కార్యక్రమంలో పాల్గొని, ఐదేళ్ల లోపు చిన్నారులకు స్వయంగా పోలియో చుక్కలు వేయించారు.ఈ సందర్భంగా కోన సుబ్బారావు మాట్లాడుతూ, "దేశ భవిష్యత్తు అయిన చిన్నారుల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం మన అందరి బాధ్యత. పోలియో మహమ్మారిని పూర్తిగా తరిమికొట్టాలంటే ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి" అని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలకు మరియు తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించిన తల్లిదండ్రులకు కోన సుబ్బారావు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. రాయప్పగారిపల్లిలో నిర్వహించిన ఈ పల్స్ పోలియో డ్రైవ్‌లో చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.



# పోలియో మహమ్మారిని తరిమికొడదాం.. టిడిపి తెదేపా ఇన్చార్జ్ జగన్మోహన్ రాజు

**రాజంపేట, జూన్ 28 ప్రభాతవార్త**

పోలియో మహమ్మారిని తరిమికొట్టేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని, ప్రతి తల్లి అందుకు ప్రభుత్వ అధికారులకు సహకరించి పల్స్ పోలియోను సద్వినియోగం చేసుకోవాలని రాజంపేట తెలుగుదేశం పార్టీ అసెంబ్లీ ఇన్చార్జ్ జగన్ మోహన్ రాజు పిలుపునిచ్చారు. రాజంపేట రాజంపేట పట్టణం నూనె వారి పల్లెలో ఆదివారం చిన్నారికి పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూపోలియో రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. అప్పుడే పుట్టిన చిన్నారుల నుంచి 5 సంవత్సరాల లోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. పోలియో లాంటి ప్రమాదకర వ్యాధుల నుండి చిన్నారులను రక్షించుకునేందుకు ఈ కార్యక్రమం కీలకమన్నారు. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి పల్స్ పోలియో కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట డాక్టర్ అనిల్ కుమార్,పట్టణ అధ్యక్షులు దగ్గుపాటి సుబ్రహ్మణ్యం నాయుడు,కౌన్సిలర్ గుణకల చిన్న ,పట్టణ క్లస్టర్ ఇంచార్జ్ కొల్లి రెడ్డయ్య నాయుడు,మాజీ కౌన్సిలర్ గుగ్గిళ్ళ చంద్రమౌళి , పెనిగలపాటి చంద్ర,యూనిట్ ఇంచార్జ్ మహమ్మద్ అలీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



రాజంపేటలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న జగన్మోహన్ రాజు